జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*
https://prajapalana.com/epaper.php

ప్రజాపాలన
నిజాయితీ, నిబద్ధతతో జర్నలిస్టుగా పనిచేయాలనుకొంటున్నారా?
మీ ఏరియాలోని ప్రజల సమస్యలను మీ కలం ద్వారా ప్రభుత్వదృష్టికి తీసుకువెళ్లాలి అనుకుంటున్నారా ?ఇంకెందుకు ఆలస్యం మీ ఏరియాకు మీరే రిపోర్టర్... రండి ..ప్రజాపాలన దినపత్రిక మీకు అవకాశం కల్పిస్తుంది
వివరాలకు సంప్రదించండి 8886022523

సంపుటి 5 సంచిక 275 | హైదరాబాద్, జులై 26 మంగళవారం 2022 | 8 పేజీలు | వెల : 5.00

# రాష్ట్రపతిగా ద్రౌపది ముర్ము ప్రమాణస్వీకారం



ఢిల్లీ, ప్రజాపాలన ప్రతినిధి: 15వ రాష్ట్రపతిగా ద్రౌపది ముర్ము పార్లమెంట్ సెంట్రల్ హాల్ లో ప్రమాణస్వీకారం చేశారు.ద్రౌపది ముర్ముతో సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ ప్రమాణం చేయించారు. ప్రమాణ స్వీకారోత్సవానికి రామ్ నాథ్ కోవింద్, ఉపరాష్ట్రపతి వెంకయ్య, ప్రధాని మోడీ, కేంద్ర మంత్రులు, ఎంపీలు ప్రముఖులు పాల్గొన్నారు.ముర్ముకు గన్ సెల్యూట్‌తో గౌరవ వందనం చేశారు. ప్రమాణ స్వీకారం తరువాత ద్రౌపతి ముర్ము జాతినుద్ధేశించి ప్రసంగించారు. రాష్ట్రపతిగా ఎన్నుకున్న దేశప్రజల కు ధన్యవాదాలు తెలిపారు.మీ విశ్వాసం నిలబెట్టుకునేందుకు కృషి చేస్తానని ద్రౌపది ముర్ము అన్నారు. వచ్చే 25 ఏళ్లలో అద్భుతమైన పురోగతి సాధించాలని తెలిపారు. ఇబ్బందులున్నా సంకల్ప బలంతో ముందుకెళ్లాలని అన్నారు. దేశ ప్రజలకు కార్గిల్ విజయోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.తమపై మీరు ఉంచిన నమ్మకమే నా బలమని.ఒకప్పుడు చదువుకోవడం నా కల అని అన్నారు.ఇప్పుడు రాష్ట్రపతి అయ్యాను అని ఆమె అన్నారు.వార్డు కౌన్సిలర్ నుంచి రాష్ట్రపతి వరకు వచ్చానని.ఆదివాసీ గ్రామం నుంచి తమ ప్రయాణం మొదలైందని రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టగలిగానని అన్నారు.భారత ప్రజాస్వామ్యం గొప్పతనం ఇదని .రాజ్యాంగం ప్రకారం బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తానని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు.మహిళలు దేశ అభివృద్ధిలో మరింత భాగస్వామ్యం కావాలని .దేశంలో మరింత వేగంగా అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉందని ముర్ము అన్నారు.దేశంలో మరింత వేగంగా అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉందని చెప్పారు.'కార్గిల్ విజయ్ దివస్' భారత్ శౌర్యానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. స్వాతంత్ర్య సమర యోధుల కలలు సాకారం చేయాల్సి ఉందని వెంకయ్య నాయుడు అన్నారు.'సబ్ కా ప్రయాస్-సబ్ కా కర్తవ్య' నినాదంతో ముందుకు వెళ్లాలని చెప్పారు.అమృత్ మహోత్సవ్ వేళ మరింత వేగవంతంగా పని చేయాలని వెంకయ్య నాయుడు అన్నారు.అవినీతి నియంత్రణతో దేశం పురోభివృద్ధి వైపు పయనిస్తోందని చెప్పారు.రేపు కార్గిల్ విజయ్ దివస్ వేడుకలు జరుపుకుంటున్నామని అన్నారు. భారత జవాన్ల శౌర్యానికి నిదర్శనంగా విజయ్ దివస్ వేడుకలు నిర్వహిస్తున్నామని .జవాన్లు, దేశ ప్రజలందరికీ వెంకయ్య నాయుడు విజయ్ దివస్ శుభాకాంక్షలు తెలిపారు.

# ఢిల్లీకి బయల్దేరిన కేసీఆర్..



హైదరాబాద్, ప్రజాపాలన ప్రతినిధి: సీఎం కేసీఆర్ ఢిల్లీ బయల్దేరారు. బేగం పేట ఎయిర్ పోర్టు నుంచి ఢిల్లీ వెళ్లారు. రెండు మూడు రోజుల పాటు అక్కడే ఉండనున్నారు.పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహాలపై పార్టీ ఎంపీలతో చర్చించనున్నారు. కేసీఆర్ వెంట సిఎస్ సోమేష్ కుమార్, ఎంపీలు జోగినపల్లి సంతోష్ కుమార్, జి.రంజిత్ రెడ్డి, ఎల్బీ నగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, టీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి రావుల శ్రవణ్ కుమార్ రెడ్డి, కరీంనగర్ మాజీ మేయర్ రవీందర్ సింగ్ ఉన్నారు.

# అందుబాటులోకి ఈవినింగ్ క్లినిక్‌లు..

## కసరత్తు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం



హైదరాబాద్, ప్రజాపాలన ప్రతినిధి: పేద, నిరుపేద రోగుల కోసం ఈవినింగ్ క్లినిక్‌లు ఏర్పాటు చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజలు కృతజ్ఞతలు చెబుతున్నారు. సాయంత్రం ఓపీ సేవలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని, ఆరోగ్య సలహాలు, పరీక్షలు చేయించుకునేందుకు అనువుగా ఉన్నాయని చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బోధనాసుపత్రుల్లో సాయంత్రం ఓపీ సేవలు ప్రారంభమవుతున్నాయి. ఇప్పటికే వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో ఓపీ సేవలు ప్రారంభం కాగా తాజాగా హైదరాబాద్‌లోని ఉస్మానియా జనరల్ ఆసుపత్రిలో సోమవారం నుంచి ఈవినింగ్ ఓపీ సేవలు ప్రారంభమయ్యాయి. ఒకటి రెండు రోజుల్లో గాంధీ ఆసుపత్రితోపాటు ఇతర ప్రభుత్వ బోధనా వైద్య కళాశాలల్లో ఈ సేవలు (మిగతా 3లో..)

# కేంద్రం పనులను విపక్షాలు అడ్డుకుంటున్నాయి..: మోడీ



న్యూఢిల్లీ, ప్రజాపాలన ప్రతినిధి: కేంద్రం పనులను విపక్షాలు అడ్డుకుంటున్నాయని ప్రధాని మోడీ ఆరోపణలు చేశారు. దేశ ప్రయోజనాల కన్నా రాజకీయ ప్రయోజనాలకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నారని సోమవారం వ్యాఖ్యానించారు. పార్లమెంట్‌లో పెరిగిన ధరలపై చర్చించాలని ప్రతిపక్షాలు పట్టుబడుతున్న సమయంలో ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రతిపక్షాలు అధికారంలో ఉన్నప్పుడు తీసుకున్న నిర్ణయాలు అమలు చేయక.. ఇప్పుడు తమ ప్రభుత్వం చేపడుతున్న పనులకు చాలా సార్లు అడ్డంకులు సృష్టిస్తున్నాయని సమాజ్‌వాదీ పార్టీ మాజీ రాజ్యసభ సభ్యుడు హర్‌మోహన్ 10వ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వ్యాఖ్యానించారు. ఇటీవల కాలంలో విపక్షాల్లో దేశ ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలు లేదా సిద్ధాంతం ఎక్కువగా ఉండే ధోరణి కనిపిస్తోందన్నారు. ఈ జులై 18న వర్షాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుండి పార్లమెంట్ ఉభయ సభల్లో విపక్షాలు పలు సమస్యలపై చర్చించాలని డిమాండ్ చేస్తున్నాయి.

# నలుగురు కాంగ్రెస్ ఎంపిల సస్పెన్షన్

## ధరలు, జీఎస్టీపై తొలగని ప్రతిష్టంభన మరో సారి దద్దరిల్లిన ఉభయ సభలు




న్యూఢిల్లీ బ్యూరో ప్రజాపాలన ప్రతినిధి:: ధరల పెరుగుదల, నిత్యావసరాలపై జీఎస్టీకి వ్యతిరేకంగా నిరసన తెలిపిన నలుగురు కాంగ్రెస్ ఎంపీలను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ప్రస్తుత సమావేశాలు ముగిసేంతవరకు సభ నుంచి సస్పెండ్ చేశారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి ఇందుకు సంబంధించిన తీర్మానాన్ని ప్రవేశపెట్టగా మూజువాణి ఓటుతో సభ ఆమోదించింది. నలుగురు కాంగ్రెస్‌సభ్యులు మాణిక్యం ఠాకూర్, టిఎన్ ప్రతాపన్, జ్యోతిమణి సెన్నిమలై, రమ్యా హరిదాస్ ప్రభుత్వానికి (మిగతా 3లో..)




# తెలంగాణ హైకోర్టుకు కొత్తగా ఆరుగురు న్యాయమూర్తులు

హైదరాబాద్: తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తుల పోస్టులకు ఆరుగురు న్యాయాధికారుల పేర్లను సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది. హైకోర్టు జడ్జీలుగా కొలీజియం సిఫారసు చేసిన వారిలో ఈవీ వేణుగోపాల్, నగేష్ భీమపాక, పుల్లా కార్తీక్, కాజా శరత్, జె.శ్రీనివాసరావు, నామవరపు రాజేశ్వరరావు ఉన్నారు. న్యాయాధికారుల పేర్లను కొలీజియం.. కేంద్రానికి పంపింది. (మిగతా 3లో..)

# తెలంగాణలో అడ్వెంచర్ టూరిజం..

## సెప్టెంబర్ నుంచి వరల్డ్ వాటర్‌ఫాల్ పోటీలు



హైదరాబాద్, ప్రజాపాలన ప్రతినిధి: ఉవ్వెత్తున దూకే జలపాత ధారల్లో తాడు సాయంతో పై నుంచి కిందకు చేరడమే వాటర్‌ఫాల్ రాప్లింప్ గా పిలుస్తారు. ప్రపంచంలోని చాలా దేశాలు అడ్వెంచర్ టూరిజంలో భాగంగా సాహసాలు చేసేవారి కోసం ఈ పోటీలు పెడుతుంటాయి. అయితే ఈ సారి జరిగే ప్రపంచకప్‌కు తెలంగాణ ఆతిథ్యమివ్వనుంది.. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం మాన్‌కాపూర్ గ్రామ సమీపంలోని గాయత్రి జలపాతం వద్ద సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 4 వరకు వరల్డ్ వాటర్‌ఫాల్ రాప్లింగ్ పోటీలు జరగనున్నాయి పైగా ఇలాంటి పోటీలకు తెలంగాణ ఆతిథ్యమివ్వడం ఇదే తొలిసారి. అయితే ఇప్పుడు జరగనున్న రాప్లింగ్ వరల్డ్ కప్ మూడోది. కరోనా కారణంగా ఏడాది విరామం తర్వాత ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. గతంలో రెండు ప్రపంచ వాటర్ ఫాల్ రాప్లింగ్ పోటీలు 2019, 2020లో ఏపీ అరకులోయలోని 420 అడుగుల కటిక జలపాతం వద్ద నిర్వహించారు. ఇప్పుడు తెలంగాణలో జరిగే ఈ పోటీల్లో సుమారు 30కి పైగా దేశాల ప్రతినిధులు పాల్గొనున్నారు. ప్రపంచవ్యాప్తంగా 33 టీవీ ఛానెల్స్ ఈ పోటీలను టెలికాస్ట్ చేసే అవకాశం ఉంది. రెండు విభాగాల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన జట్లకు మెడల్స్, పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు, నగదు ప్రోత్సాహకాలు అందజేస్తారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిల నుంచి 30కి పైగా జట్లు ఈ ఈవెంట్‌లో పాల్గొననున్నాయి. దరఖాస్తులు ఇప్పటికే రావడం ప్రారంభమయ్యాయి. ఓరియంటేషన్ ప్రోగ్రామ్ ప్రోగ్రెస్‌లో ఉంది. త్వరలో ట్రయల్ రన్ నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు విస్తృత ఏర్పాట్లు కొనసాగుతున్నాయి.

# ప్రస్తుతం కాంగ్రెస్ లో తెలంగాణ ఉద్యమకారులెవరూ లేరు



హైదరాబాద్ :మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నుంచి గెలిచిన 12 మంది ఎమ్మెల్యేలు టీఆర్ ఎస్ లోకి వెళ్లినా అధిష్టానం పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ లో తెలంగాణ ఉద్యమకారులెవరూ లేరన్నారు. తెలంగాణలో బీజేపీ పార్టీ బలం పుంజుకుంటుందని గతంలో చెప్పానని, తాను చెప్పినట్లుగానే అదే నిజమైందని చెప్పారు. తన ప్రతిష్టతను దెబ్బతీసేందుకు సీఎం కేసీఆర్ మనుషులు సోషల్ మీడియాలో పని చేశారని ఆరోపించారు. తాను కాంగ్రెస్ కు దూరమవుతాననే ఆవేదనతో సీఎల్పీ నేత మల్లు భట్టి విక్కమార్క వచ్చి తనతో మాట్లాడరని చెప్పారు. అందరం కలిసి పని చేయాలని కోరడానికి భట్టి వచ్చారన్నారు.

(మిగతా 3లో..)

ఫూలే - అంబేడ్కర్ రాజ్యాధికార సమితి (PARS)
అంబేడ్కర్ రాజనీతి మూవ్ మెంట్ (ARM)
(A Unit of JAC Regn. No. 1047 of 2016)
Central Office: # 6-2-29/3/12, 3rd Floor, Doublat Plaza, Lakdi-ka-pool, Hyderabad-500004
https://ambedkarrajaneethi.com Email : ambedkarrajaneethimovement@gmail.com
ఆత్మ గౌరవ పరిరక్షణే మన లక్ష్యం - రండి కదలిరండి

బహుజన మిత్రులారా!
జై భీమ్

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 74 సంవత్సరాలు అయినప్పటికీ 85 % బహుజనుల సమస్యలు సమస్యలుగానే ఉంటున్నాయి. అత్యధిక జనాభా కలిగి ఉన్న బహుజనులు కూడా, బహుజన సభ్యులను మెమోరాండం ద్వారానే ప్రభుత్వాలను అడుక్కుంటున్నారు. సమస్యలు అర్థం కాని అల్పసంఖ్యాక ఆధిపత్యకులాలు ఈ దేశాన్ని ఏలుతున్నారు. మన దేశాభివృద్ధి జరగాలంటే సమస్యలకు పరిష్కారం తెలిసిన బహుజనులు,ఫూలే పోరాట పటిమతో బాబా సాహెబ్ డా.అంబేడ్కర్గారు రాజ్యంగం ద్వారా కల్పించిన హక్కులతో ఒకరి సమస్యను ఒకరు సమర్థించుకుంటూ చేయి చేయి కలిపి ముందుకు సాధిద్దాం. బహుజన కులాల మధ్య అంతరాలను తొలిగించి సభ్యత్వాలను పెంపొందిస్తూ బహుజనుల ఆత్మ గౌరవాన్ని కాపాడుకొందాం.
సమ సమాజ స్థాపనకు ఈ సామాజిక ఉద్యమంలో లక్షలాది మంది మెంబర్స్‌గా చేరడం వల్ల మన సమస్యలను మనమే పరిష్కరించుకోవడమే కాకుండా బహుజన రాజ్యాధికారం వైపు నడిపించగలము.

ప్రధాన ఆశయాలు
సమసమాజ స్థాపనకు ఫూలే అంబేడ్కర్ రాజ్యాధికార సమితి (PARS)
ఆశయాల పట్ల అవగహన కల్పించడానికి రండి.. కదలి రండి..
1. బహుజన సమస్యలను సంవత్సరాల తరబడి పరిష్కారం కాకుండా పేదవాడిని ఇంకా పేదవాడుగా... గుడిసెలను ఇంకా పూడి గుడిసెలుగా... మురికి వాడలను ఇంకా మురికి కుపాలుగా చేస్తూ.. అల్ప సంఖ్యాక ఆధిపత్యకులాలు పరిపాలిస్తున్నారు. అందువల్ల దేశాభివృద్ధి కావాలంటే సమస్యలను పరిష్కరించే సత్తా ఉన్న అత్యధిక జనాభా కలిగిన బీసీలను ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలనేది ప్రతిపాదన.
2.మహిళలను అబలలుగా ఈ సమాజం చిత్రీకరిస్తుంది. కాబట్టి అబల కాదు సబల అని నిరూపించడానికి అన్ని రంగాల్లో మహిళలకు 50% రిజర్వేషన్లు కల్పించాలని ప్రతిపాదిస్తుంది.
3.ఏ కులం సమస్యలు ఆ కులం వారికే తెలుస్తాయి. కానీ 40 లక్షల జనాభా ఉన్న కులాలు ఇంకా అసెంబ్లీ మెట్లు ఎక్కలేదు. కాబట్టి 5 లక్షల జనాభా ఉన్న ప్రతి కులం నుండి నాయకులను అసెంబ్లీకి ఎమ్మెల్యేలుగా పంపాలని ప్రతిపాదన.
4. రిజర్వేషన్ల వల్ల రాష్ట్రం నాశనం అవుతుందని కొంతమంది అల్ప సంఖ్యాకులయిన పాలక కులాల వారు బాధపడుతున్నారు. అందువల్ల భారత రత్న బాబా సాహెబ్ డా.బి.ఆర్.అంబేడ్కర్ గారు భారత రాజ్యంగ పీఠికలో ప్రతిపాదించిన సమానత్వ సిద్ధాంతం ప్రకారం రిజర్వేషన్లను జనాభా ప్రాతిపదికన అన్ని రంగాల్లో అవకాశాలు కల్పిస్తూ మీరెంతో మీకంత ( మీ జనాభా ఎంతో మీకంత రిజర్వేషన్ ) అని ప్రతిపాదిస్తుంది.
5.డా. బీ.ఆర్.అంబేడ్కర్ గారు ప్రతిపాదించిన విధంగా ముస్లీం,క్రిస్టియన్,ఎస్సీ,ఎస్టీ,బుద్ధిస్టులకు సేపరేట్ ఎలక్టోరేట్ (ప్రత్యేక నియోజక వర్గాలు) అవసరమని ప్రతిపాదిస్తుంది.
6.సమతా కులం: కులాంతర వివాహం చేసుకున్న వారి యొక్క పిల్లలకు సమతాకులంగా నామకరణం చేస్తే ప్రభుత్వం అంగీకరించాలి. ఆ నవ తరానికి ఆర్థిక, రాజకీయ, ఉద్యోగ, విద్యా రంగాలలో ప్రాముఖ్యత ఇవ్వాలి మరియు వారి తల్లిదండ్రులకు ప్రాముఖ్యతతో కూడిన రక్షణ కల్పించాలి. తద్వారా 150 సంవత్సాలతో అంబేడ్కర్ కోరుకున్న కుల రహిత సమాజాన్ని చూడవచ్చు.

ఈ ప్రతిపాదనలలో ఏ ఒక్క ప్రతిపాదనను అంగీకరించినా...వారు ప్రతి ఒక్కరూ వారి వారి కుటుంబ సభ్యులతో సహా www.ambedkarrajaneethi.com వెబ్సైట్ ద్వారా సభ్యులుగా చేరి ఆశయ సాధనకు మద్దతు తెలిపి, బహుజన ఆత్మగౌరవాన్ని పరిరక్షించుకునేందుకు రండి.. కదలిరండి...

కమిటీల నిర్మాణం
రెండు తెలుగు రాష్ట్రాలలో రాష్ట్ర,జోనల్,పార్లమెంట్,అసెంబ్లీ, మండల స్థాయిలలో కమిటీల నిర్మాణం జరుగుతుంది.
ప్రతి కమిటీలో కనీసం 21 మంది లేదా అంతకంటే ఎక్కువమంది సభ్యులుగా ఉంటారు.
అదేవిధంగా ప్రతి కమిటీలో కనీసం 7 కులాల నుండి లేదా అంతకంటే ఎక్కువ కులాల నుండి ప్రాతినిధ్యం కలిగివుంటుంది.

# సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పటిష్టమైన చర్యలు

## రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ, ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు

మంచిర్యాల బ్యూరో, జులై 25, ప్రజాపాలన :ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికార యంత్రాంగం సమన్వయంతో పటిష్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ, ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్రావు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమం, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, సంబంధిత అధికారులతో సీజనల్ వ్యాధుల నియంత్రణ, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ గ్రామాలు, పట్టణాలలో పారిశుద్ధ్య నిర్వహణలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, రహదారులు, మురుగు కాలువలు, నివాస ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి విషజ్వరాలు ప్రబలకుండా పురపాలక, పంచాయతీరాజ్, సంబంధిత శాఖల సమన్వ యంతో అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యం కల్పించాలని, ఆగస్టు మాసం నాటికి ప్రతి విద్యా సంస్థలో ప్రత్యేకంగా వ్యాక్సినేషన్ శిబిరాలు ఏర్పాటు చేసి 12-17 వయస్సు గల విద్యార్థులకు వంద శాతం వ్యాక్సి నేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. కాచిన చల్లార్చి వడపోసిన నీటిని త్రాగే విధంగా ప్రచారం చేయాలని, అధికారులు తరచూ వసతి గృహాలను ఆకస్మిక తనిఖీ నిర్వహించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ భారతి హోళికేరి మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టామని, వైద్య, ఆరోగ్య శాఖ, పంచాయతీ రాజ్, పురపాలక



శాఖల అధికారులు సమన్వయంతో సీజనల్ వ్యాధులు, విషజ్వరాలు అధికంగా నమోదయ్యే ప్రాంతాలను గుర్తించి నియంత్రణ దిశగా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు అవసరమైన మందులను అందించడం జరుగుతుందని, విషజ్వరాల అనుమానితులకు పరీక్షలు నిర్వహించి తగు చికిత్స అందిస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా? సుబ్బారా యుడు. జిల్లా పంచాయతీ అధికారి నారాయణరావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి నరేందర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన బాధితులను ఆదుకోవాలి: కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి



రాయికల్, జూలై 25 (ప్రజాపాలన ప్రతినిధి): ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షాలకు ప్రభుత్వం నుంచి సాంత్వనము కరువై రైతులను ఆదుకొమ్మని ప్రభుత్వానికి బాధ్యతలు గుర్తు చేస్తున్నానని కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు.సోమవారం మండలంలోని జగన్నాథ్పూర్, బోర్నపెల్లి గ్రామాల్లో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు ఇళ్లు కోల్పోయిన బాధితులను పరామర్శించి,వరదలకు నష్టపోయిన వంటలను,ధ్వంసమైన రహదారులను పరిశీలించారు. అనంతరం రాయికల్ పట్టణంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యంతో ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షాలకు పంట పొలాల్లో నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 10వేల నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.భారీ వర్షాల కారణంగా పూర్తిగా ఇల్లు కోల్పోయి నిరాశ్రయులైన వారికి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద ప్రభుత్వం ఇల్లు మంజూరుచేయాలన్నారు .ప్రకృతి వైపరీత్యంతో నష్టపోయిన రైతులు బాధితులను ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం 25శాతం,కేంద్ర ప్రభుత్వం 75శాతం పరిహారాన్ని అందించి ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు.బాధితులను ఆదుకోవడానికి నష్టం అంచనవేసి నివేదికను కేంద్రానికి అందించి సహాయం పొందే అవకాశం ఉండి కూడా రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో సహాయం పొందడంలో విఫలమవుతుందని, ఎస్టీ అభివృద్ధి నిధులు రూ. 25 వేల కోట్ల నిధులు ఉన్నప్పటికీ కేటాయించక పోవడంతో నిధుల క్యారీఫార్వర్డ్ అవడానికి కారణం ఏంటనిప్రశ్నించారు. బోర్నపెల్లి గ్రామంలో కౌలు రైతులను కాపాడే నిమిత్తం వార్తా సేకరణకు వెళ్లి వీధి నిర్వహణలో మృతిచెందిన జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన జర్నలిస్టు జమీర్ కుటుంబానికి వరద ప్రవాహాలా పర్యవేక్షణ కింద ప్రభుత్వం జీవో నెంబర్ ఎం.ఎస్ 2 ప్రకారం రూ4 లక్షల ఆర్థిక సాయం చేసే అవకాశం ఉండి కూడా ఇప్పటికీ ప్రకటించక పోవడం బాధాకరమన్నారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోపి రాజారెడ్డి,కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీందర్ రావు,పట్టణ అధ్యక్షులు మ్యాకల రమేష్,ప్రధాన కార్యదర్శి గుర్రం మహేందర్ గౌడ్,జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కొయ్యెడి మహిపాల్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి షాకీర్,నాయకులు ఎద్దండి దివాకర్ రెడ్డి,పరాచ శంకర్,బాపు రపు నర్సయ్య, కొడిపెల్లి ఆంజనేయులు, ప్రహ్లాద్ హరీష్, చౌడారపు లక్ష్మీనారాయణ, కడకుంట్ల నరేష్,కొత్త పెల్లి గోపాల్,మంద రమేష్,జలపతి, లింగంగౌడ్, తదితరులు పాల్గొన్నారు.




**సోమవారం హరిజన బస్తీ వెల్ఫేర్ అసోసియేషన్ వారు నిర్వహించిన ఫలహారం బండి ఊరేగింపులో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ శేషు కుమారి మరియు తెరాస నేతలు కూతురు నరసింహ,కట్ట బలరాం,సంపత్ ముదిరాజ్,బాన లక్ష్మి,శ్రీ లక్ష్మి,రాజేశ్వరి,అంజి,చంటి**

## ఢిల్లీ హైకోర్టుకెళ్లండి.. ఆధార్, ఓటరు ఐడి అనుసంధానంపై పిటిషనర్‌కు సుప్రీం సూచన

న్యూఢిల్లీ : ఆధార్, ఓటర్ ఐడి కార్డులను అనుసంధానించడానికి వీలు కల్పిస్తున్న ఎన్నికల చట్టాల సవరణను సవాలు చేస్తున్న పిటిషన్‌తో ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించాల్సిందిగా కాంగ్రెస్ నేత రణదీప్ సూర్జెవాలాను సుప్రీం కోర్టు సోమవారం కోరింది. ఈ మేరకు సూర్జెవాలా హైకోర్టుకు వెళ్లే స్వేచ్ఛను జస్టిస్ డి.వై. చంద్రచూడ్, జస్టిస్ ఎ.ఎస్.బపన్నలతో కూడిన ధర్మాసనం కల్పించింది. “ఎన్నికల సవరణ చట్టంలోని 4, 5 సెక్షన్ల చట్టబద్ధతను పిటిషనర్ సవాలు చేస్తున్నందున సమర్ధవంతమైన ప్రత్యామ్నాయ పరిష్కార మార్గం హైకోర్టు ముందుంది. అందువల్ల 226వ అధికరణ కింద హైకోర్టుకు వెళ్ళే స్వేచ్ఛను మంజూరు చేస్తున్నాం.” అని బెంచ్ తన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఆధార్, ఓటర్ ఐడి కార్డులను అనుసంధానించడం వల్ల పౌరుల ప్రాథమిక హక్కైన గోప్యతా హక్కు ఉల్లంఘించబడుతోంది. ఇది రాజ్యాంగ విరుద్ధం, రాజ్యాంగాన్ని తీవ్రంగా వ్యతిరేకించడమే అవుతుందని పేర్కొన్నారు. ఆధార్‌తో ఓటర్ ఐడిని అనుసంధానించడం పూర్తిగా నిర్హేతుకమైనదని కాంగ్రెస్ నేత వాదించారు.. ఆధార్ కార్డు అనేది నివాస ధృవీకరణ పత్రం, ఓటర్ ఐడి అనేది పౌరసత్వ ధృవీకరణ. పూర్తిగా భిన్నమైన ఈ రెండు పత్రాలను అనుసంధానించాలని ఈ అభ్యంతరకరమైన సవరణ పేర్కొంటోందని అన్నారు. ఆధార్‌ను ఓటరు గుర్తింపు కార్డుతో అనుసంధానించడం వల్ల ఓటర్ల వ్యక్తిగత డేటా అంతా అధికారుల గుప్పెట్లో ఉంటుంది, దీనివల్ల ఓటర్లపై పరిమితులు విధించే అవకాశం వుంటుందన్నారు. వ్యక్తిగత డేటాను రహస్యంగా వుంచడం, నిర్దిష్ట పరిస్థితుల్లో మినహా ఆ డేటాను ఏ ప్రభుత్వ లేదా చట్టబద్ధ అధికారికి అందుబాటులో వుంచకపోవడమనేది పౌరుడి ప్రాథమిక హక్కు. కాబట్టి ఇలా కార్డులను అనుసంధానించడం వల్ల ఓటర్లపై నిఘా పెరిగే అవకాశాలు వున్నాయి. సున్నితమైన ఈ సమాచారాన్ని వాణిజ్య అవసరాలకు ఉపయోగించుకునే అవకాశాలు కూడా వుంటాయని సూర్జేవాలా తన పిటిషన్‌లో పేర్కొన్నారు. పౌరుల డేటాను పరిరక్షించేందుకు ప్రసుత్తం ఎలాంటి చట్టాలు లేనందున ఈ పరిస్థితి మరింత తీవ్రమవుతుందని అన్నారు. గతేడాది డిసెంబరులో మూజువాణీ ఓటు ద్వారా ఎన్నికల చట్టాల (సవరణ) బిల్లును లోక్‌సభ ఆమోదించింది.

## పార్స్ ఏ.పీ స్టేట్ (రిటైర్డ్ ఎంప్లాయిస్ విభాగము)కు వడ్లాన రమేష్ కుమార్ నియామకం



జులై 25 ప్రజాపాలన ప్రతినిధి : పూలే అంబేద్కర్ రాజ్యాధికారి సమితి పార్స్ ఏ.పీ స్టేట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ విభాగము కు వైస్ ప్రెసిడెంట్ గా వడ్లాన రమేష్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్స్ ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ కోఆర్డినేటర్ కటికల రవి కుమార్ , వడ్లాన రమేష్ కుమార్ ని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వీరు గుంటూరు మరియు నరసరావుపేట పార్లమెంట్స్ పరిధిలో రాజకీయ అవగాహన ఉన్న ముఖ్య నాయకులతో కమిటీలను నియమించడంతో పాటు బహుజన వాదాన్ని బలపరిచే వివిధ రంగాలలో పని చేస్తున్న వారిని పార్స్ అనుబంధ సంఘాలుగా వీరి పరిధిలో నియమించి, రెండు విభాగాల మధ్య సమన్వయ పరిచి వారందరి సహకారంతో బహుజన రాజ్యాధికారాన్ని సాధించాలని ఈ సంధర్భంగా ఆయన పేర్కొన్నారు. వడ్లాన రమేష్ కుమార్ నియామకం పట్ల పలువురు బహుజనులు అభినందిస్తూ హర్షం వ్యక్తం చేసారు.

## మా ఇ.ఎన్.టి ఆధ్వర్యంలో విజయవంతంగా 64వ లైవ్ సర్జికల్ వర్క్‌షాప్

హైదరాబాద్ (ప్రజాపాలన ప్రతినిధి ):చెవి, ముక్కు, గొంతు సంబంధిత వ్యాధులకు అత్యుత్తమ చికిత్స అందిస్తున్న మా ఇ.ఎన్.టి ఆస్పత్రి అద్వర్యం లో 64వ లైవ్ సర్జికల్ వర్క్ షాప్ ను దిగ్విజయంగా పూర్తి చేసింది. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ లోని తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ కె.ఆర్ మేఘనాథ్ మాట్లాడుతూ.. ఇ.ఎన్.టి విభాగంలో ఇప్పుడిప్పుడే కెరీర్ మొదలుపెట్టిన వైద్యుల శిక్షణ నిమిత్తం తమ హాస్పిటల్ అద్వర్యం లో తరచుగా ఇలాంటి వర్క్ షాప్ లు నిర్వహిస్తోందని



తెలిపారు. కేవలం చెవి, ముక్కు, గొంతు సంబంధిత వ్యాధులకే కాకుండా తల , మెడ, కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్ర చికిత్సలకు మా ఇ.ఎన్.టి అసలైన చిరునామాగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఈ వర్క్ షాప్ లకు దక్షిణ భారతదేశం నలుమూలల నుంచి 100 మందికి పైగా డాక్టర్లు హాజరు కాగా డాక్టర్ కె.ఆర్ మేఘనాథ్ ఆధ్వర్యంలో వైద్యులు తుషార్ కాంతి ఘోష్, రామకృష్ణ, వెంకట్ రామ్ రెడ్డి, కిరణ్, బెంజమిన్, మనీష్ గుప్తా వంటి నిష్ణాతులు శిక్షణ ని ఇచ్చారు. ఈ వర్క్ షాప్ లలో దారిద్ర్య రేఖకు దిగువనున్న 25 మంది రోగులను ఎంపిక చేసి వారికి పూర్తి ఉచితంగా శస్త్ర చికిత్సలను నిర్వహించారు. సైనసైటిస్, చెవి నుంచి చీము కారడం, నోస్ బ్లాక్, తలనొప్పి, గొంతు ఇన్ ఫెక్షన్ తో బాధపడుతున్న రోగులకు టిమ్పనోప్లాస్టీ, మాస్టోయిడెక్టమీ, సైనస్ సర్జరీ, అడెనాయిడ్ టాన్సిల్ శస్త్ర చికిత్సలు చేశారు. వైద్యుల్లో విశ్వాసాన్ని పెంపొందించడం, వారంతా నమ్మకంగా ధైర్యంగా ఇ.ఎన్.టి సర్జరీలు చేసేలా ప్రేరేపించడమే ఈ వర్క్ షాప్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. మంచి విజయాలు సాధించేందుకు, డాక్టర్ల సక్సెస్ రేటు పెంచేందుకు ఈ వర్క్ షాప్ లు దోహదపడుతాయని తెలిపారు.

## సాయి యదాద్రి సేవ ఆశ్రమము ఆధ్వర్యంలో నేరెళ్ల కోటేశ్వరరావు కు ఘన సన్మానం...





హైదరాబాద్ (ప్రజాపాలన ప్రతినిధి ):పలు సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్న నేరెళ్ల కోటేశ్వరరావు ను సాయి యదాద్రి సేవ ఆశ్రమము మరియు రెడ్ క్రాస్ అధ్వర్యములో ఘనంగా సన్మానించారు. హైద్రాబాద్ ఉప్పల్ లోని ధర్మపురి కాలనిలో శుక్రవారం జరిగిన Sysa జనరల్ బాడీ మీటింగ్ లో స్నేహ టీవీ డైరెక్టర్ నేరెళ్ల కోటేశ్వరరావును సన్మానించారు. ఈ సందర్బంగా పలువురు వక్తలు కోటేశ్వరరావు సేవలను కొనియాడుతూ ఆయన 80 జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో డి.అశోక్,మహేశ్, జె వై శెట్టి, శ్రీనివాస్,రాజేంద్ర ప్రసాద్, అప్పలరాజు,శశాంక్, కుమార్,వైదేవి లు sysa మరియు రెడ్ క్రాస్ తరపున రమేశ్ మరియు క్లాస్ మేట్స్ క్లబ్ తరపున వినయకుమార్,రమేశ్ పాల్గొన్నారు.

## “గ్రేస్ న్యూ డిజైనర్ లగ్జరీ స్టూడియో” ప్రారంభం



హైదరాబాద్ (ప్రజాపాలన ప్రతినిధి ):డిజైనర్ రంగంలో దూసుకుపోతున్న గ్రేస్ న్యూ డిజైనర్ లగ్జరీ స్టూడియో నూతన స్టోర్ ను రాష్ట్ర ఉప సభాపతి పద్మారావు గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై స్టూడియో సీఈవో మనోహర్ తో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డిజైనర్ దుస్తులను కొనేందుకు చాలామంది ఆంధ్రప్రదేశ్, విజయవాడ ప్రాంతాల నుంచి హైదరాబాద్ నగరానికి వస్తూ ఉంటారని అన్నారు. వారి అందరికీ మంచి డిజైనర్ దుస్తులను అందించేందుకు అందుబాటులో ఉండే విధంగా సికింద్రాబాద్ లో దాదాపు 1500 చదరపు అడుగుల విస్తీర్ణంలో తమ నూతన లగ్జరీ రిటైల్ స్టోర్ ను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. బోటిక్ రెగ్యులర్ గా ఉన్నా ఫ్యాబ్రిక్, స్టిచ్చింగ్, డిజైనింగ్ ఇలా అన్ని రకాలు తమ వద్ద అందుబాటులో ఉంటాయని తెలిపారు.ఫ్యాబ్రిక్ అనేది ఎక్కడైనా దొరుకుతుంది. కానీ ఫిట్టింగ్ అనేది ఇంపార్టెంట్ అని అన్నారు. మనకు పర్ఫెక్ట్ స్టిచ్చింగ్ చేయడానికి రాజుతో కలసి ఈ స్టోర్ ను స్టార్ట్ చేయడం జరిగిందని పేర్కొన్నారు.ఇప్పటికే తమ వద్దకు ఇతర రాష్ట్రాల వాళ్ళు వచ్చి డిజైన్ చేయించుకుంటానని అన్నారు. అలాగే విదేశాలలో నివసిస్తున్న వారికి ఆన్లైన్ ద్వారా డిజైన్ చేస్తుంటానని తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన నటులు అధిరే అభి, ఆర్జే కాజల్, అరియానా, హరి తేజ, అక్షఖాన్, జబర్దస్త్ అవినాష్, గల్లీ బాయ్స్ సద్దాం, గల్లీ బాయ్స్ భాస్కర్, యాంకర్ రవి, యాదమ్మ రాజు, బిగ్ బాస్ విశ్వ, జ్ఞానేశ్వర్ పుట్ట, మహేష్ విట్టా, శివ యాంకర్, జబర్దస్త్ అజయ్, ఆర్జే చైతూ తదితరులు అందరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## టిఆర్ఎస్ పాలనలోనే మధిర అభివృద్ధి



మధిర జులై 25 ప్రజా పాలన ప్రతినిధి టిఆర్ఎస్ పాలనలోనే మధిర అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు పేర్కొన్నారు. ఐదు కోట్ల రూపాయల నిధులతో పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న సమీకృత మార్కెట్ నిర్మాణ పనులకు సోమవారం మున్సిపల్ చైర్ పర్సన్ మొండితోక లత భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో తెలంగాణ కష్టాలు తెలిసిన వ్యక్తి కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉండడం వలన తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో శరవేగంగా దూసుకుపోతోందన్నారు.టిఆర్ఎస్ పాలనలో మధిర నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. మధిర చెరువు కట్టను ట్యాంక్ బాండగా మార్చే నిర్మాణం పనులు శరవేగంగా కొనసాగుతున్నాయన్నారు. అంబేద్కర్ సెంటర్ సుందరీకరణ, సెంటర్ లైటింగ్ లాంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేసుకోవడం జరిగిందన్నారు. వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణ పనులు అతి త్వరలోనే పూర్తి చేసి మున్సిపాలిటీ ప్రజలకు సౌకర్యంగా ఉండే విధంగా కృషి చేస్తామని ఆయన అన్నారు. మధిర అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుకి ఐటి మరియు పురపాలక శాఖ కల్వకుంట్ల తారక రామారావుకి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మదిర మున్సిపాలిటీ కమిషనర్ అంబటి రమాదేవి ఏఈ నరేష్ రెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ చిత్తారి నాగేశ్వరరావు ఆత్మ కమిటీ చైర్మన్ రంగిశెట్టి కోటేశ్వరరావు మధిర సొసైటీ అధ్యక్షులు బిక్కి కృష్ణ ప్రసాద్ మున్సిపల్ కౌన్సిలర్స్ వైవి అప్పారావు, కట్టా గాంధీ, ఎర్రగుంట లక్ష్మి, ధీరావత్ మాధవి గద్దల మాధురి వీరమాచినేని నాగ సులోచన వంకాయలపాటి వెంకట నాగేశ్వరావు మొండితోక జయకర్ అరిగే శ్రీనివాసరావు కొఠారి రాఘవరావు జెవిరెడ్డి ఎర్రగుంట రమేష్ కపిలవాయి జగన్మోహన్రావు పళ్ళపోతు ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి సమస్యల పరిష్కారం దిశగా చర్యలు: జిల్లా కలెక్టర్ భారతి హొళ్ళికేరి



మంచిర్యాల బ్యూరో, జూలై 25, ప్రజాపాలన :ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులపై సంబంధిత శాఖల అధికారులు సమస్యల పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భారతి హొళికేరి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్లో అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. బెల్లంపల్లి మండలం తాళ్ళగురిజాలకు చెందిన ఉప్పులేటి పెంటయ్య తన తండ్రి పేరిట 75 సం?లుగా ఉన్న పట్టా భూమిలో నిర్మించిన ఇంటిలో నివాసం ఉంటున్నానని, నా హద్దు చుట్టూ పెంచన్ ఏర్పాటు చేస్తుండగా కొందరు వ్యక్తులు ఇట్టి భూమిలో మాకు వాటా ఉంది అంటూ దౌర్జన్యంగా వచ్చి బెదిరింపులకు పాల్పడుతున్నారని, ఇట్టి విషయం పై తగు విచారణ జరిపి న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామస్తులు వారి దరఖాస్తు లో కొలాం గిరిజనులమైన మాకు ప్రభుత్వం అసైన్మెంట్ భూమి అందించడంతో సాగు చేసుకుంటూ ఈ భూములపై ఆధారపడి జీవిస్తున్నామని, రెవెన్యూ రికార్డుల లో మా పేర్లు ఉన్నప్పటికీ మాకు ఎలాంటి సమాచారం లేకుండా పై భూమిని స్వాధీన పర్చుకొని ఫుడ్ ప్రాసెసింగ్ నిర్మాణం ప్రారంభించారని, ఇట్టి విషయమై మాకు న్యాయం చేయాలని కోరారు. హాజీపూర్ మండలం గుడిపేట గ్రామానికి చెందిన ముడిమ డుగుల దుర్గయ్య తన తండ్రి పేరిట ఉన్న లావుని పట్టా భూమిని తన పేరిట మార్పు చేసి ఆన్లైన్లో నమోదు చేసి పట్టా పాస్ పుస్తకం మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కోటపల్లి మండలం దేవులవాడ గ్రామానికి చెందిన ఆసరెల్లి సమ్మయ్య అలియాస్ రాజేందర్ గతంలో మావోయిస్టు పార్టీ సభ్యుడిగా ఉన్న తాను 2002లో జనజీవన స్రవంతిలో కలిసిపోయానని, నాటి నుండి నేటి వరకు ప్రభుత్వం నుండి తనకు ఎలాంటి సహాయం అందలేదని, ప్రభుత్వం తరుపున అందించే భూమి, ఇంటి స్థలము, ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు. మందమర్రి మండలం అందుగులపేట గ్రామానికి చెందిన రామటెంకి లక్ష్మి తనకు అందుగులపేట గ్రామ శివారులో భూమి ఉందని, ఇట్టి భూమికి ప్రభుత్వం అందించే రైతుబంధు ఒక సంవత్సరం నుండి రావడం లేదని, రైతు బంధు ఇప్పించాలని కోరుతూ అర్జీ అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సమస్యలపై అందిన దరఖాస్తులను ఆయా సంబంధిత శాఖలకు అందించి పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నలుగురు కాంగ్రెస్ ఎంపిల సస్పెన్షన్

(మొదటి పేజీ తరువాయి)

వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ వెల్‌లోకి దూసుకెళ్లారు. పార్లమెంటు సజావుగా సాగాలని ప్రజలు కోరుకుంటున్నారని, కానీ, ఇక్కడ దానికి భిన్నంగా జరుగుతోందని స్పీకర్ అన్నారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, ఆహార పదార్థాలపై జిఎస్‌టి విధింపు వంటి అంశాలపై చర్చ జరగాలని పార్లమెంటు ఉభయ సభల్లోనూ ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం మొండిగా నిరాకరిస్తుండడంతో గత వారం రోజులుగా పార్లమెంటులో ప్రతిష్టంభన కొనసాగుతోంది. తమ ఎంపిలను సస్పెండ్ చేయడం ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమని కాంగ్రెస్ విమర్శించింది.

రాజ్యసభలోనూ గందరగోళం

ధరల పెరుగుదల, నిత్యావసరాలపై జిఎస్టీ విధింపునకు సంబంధించి రాజ్యసభలోనూ గందరగోళం చోటుచేసుకుంది. ప్రతిపక్షనేత మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ ధరల పెరుగుదలపై చర్చ చేపడతామని చెప్పినా, ఎందుకు చర్చ చేపట్టటం లేదని అడిగారు. దీనిపై చైర్మన్‌ను సంప్రదించాలని డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్ సూచించారు. టిఎంసి ఎంపి డెరిక్ ఓబ్రియాన్ మాట్లాడుతూ 2017 జులై నుంచి 2022 జులై వరకు ఐదేళ్ల పాటు రూల్ నెంబర్ 267 కింద ఒక్క అంశంపైనా చర్చ జరగలేదని అన్నారు. ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి వెళ్లి నినాదాలు చేయడంతో సభ ప్రారంభమైన 14 నిమిషాలకే మధ్యాహ్నం మూడు గంటల వరకు వాయిదా పడింది. ఆ తరువాత కూడా పరిస్థితిలో మార్పు లేదు. ప్రతిపక్షాల ఆందోళన నడుమ ఎన్‌సిపి ఎంపి ఫౌజియా ఖాన్ కరోనా తరువాత కేసులు పెరిగిన పరిస్థితిపై సావధాన తీర్మానం ప్రవేశపెట్టారు. పియూష్ గోయల్ మాట్లాడుతూ ప్రతిపక్షాలు సభను జరగనివ్వటం లేదని అన్నారు. తిరిగి ప్రారంభమైన సభలో ప్రతిపక్షాల ఆందోళన మధ్య యుఎపిఎ సవరణ బిల్లుపై చర్చ జరిగింది.

నీరజ్‌కు అభినందనలు

ప్రపంచ అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో రజత పతకం సాధించిన నీరజ్ చోప్రాకు పార్లమెంటు అభినందనలు తెలిపింది. సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు రాజ్యసభ ప్రారంభం కాగానే ఇటీవలి రాష్ట్రపతిచే ఎగువసభకు నామినేట్ చేయబడిన సంగీత దర్శకుడు ఇలయరాజా ప్రమాణ స్వీకారం చేశారు. ఆ తరువాత ప్రముఖ అథ్లెట్ (జావెలిన్ త్రో) నీరజ్ చోప్రాకు రాజ్యసభ అభినందనలు తెలిపింది.

## అందుబాటులోకి ఈవినింగ్ క్లినిక్‌లు..

(మొదటి పేజీ తరువాయి)

అందుబాటులోకి రానున్నాయి. ఆగస్టు నెలలో తెలంగాణ వైద్య విధానపరిషత్ పరిధిలోని ఆసుపత్రులతోపాటు జిల్లా, ఏరియా ఆసుపత్రుల్లోనూ ఈవినింగ్ ఓపీ క్లినిక్‌లను అందుబాటులోకి తేవాలని రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. బోధనా కళాశాలల్లో ఈవినింగ్ ఓపీ సేవలపై అధ్యయనం చేశాక తుది నిర్ణయాన్ని ప్రకటించే యోచనలో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు ఉన్నట్లు సమాచారం.

**ఈవినింగ్ ఓపీ సేవల్లో భాగంగా..**

జనరల్ మెడిసిన్‌తోపాటు జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్ విభాగాలతో సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు ఓపీ సేవలను అందిస్తున్నారు. ల్యాబ్ ఇన్వెస్టిగేషన్ రిపోర్టు కూడా అదే రోజు అందిస్తున్నారు. ఈవినింగ్ ఓపీ నేపథ్యంలో డిస్పెన్సరీల్లో మందులను కూడా ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ఓపీ రోగులకు అల్ట్రాసౌండ్ పరీక్షలను ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తున్నారు. సాయంత్రం క్లినిక్‌లలో సమీక్ష కోసం అదే రోజు నివేదికలు జారీ చేస్తున్నారు. రాష్ట్రంలోని బోధనా కళాశాలల్లో ప్రతీ రోజు సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు ఈవినింగ్ ఓపీ సేవలను అందించాలని రాష్ట్ర ప్రభుత్వం మూడు రోజుల క్రితం ఆదేశాలు జారీ చేసింది. ఉదయం మాత్రమే అందించే ఓపీ సేవలతో సుదూర ప్రాంతాల నుంచి వైద్యం కోసం వచ్చే రోగులకు ఎంతో ఇబ్బంది కలుగుతోందని మంత్రి హరీష్‌రావు భావిస్తున్నారు. రోగులకు ఉదయం ఓపీలో పరీక్షలు చేస్తే ఆ టెస్టుల ఆధారంగా మందులు పొందాలంటే మరుసటి రోజు ఓపీ వరకు వేచి చూడాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ఏ రోజు చేసిన టెస్టులకు అదే రోజు ఈవినింగ్ ఓపీలో మందులు రాసివ్వాలని, అవసరమైన వారిని ఇన్‌పేషెంట్లుగా చేర్చుకోవాలని డీఎంఈ. రమేష్‌రెడ్డి అన్ని బోధనాసుపత్రులకు ఆదేశాలు జారీ చేశారు.

## రాష్ట్రపతిగా ద్రౌపది ముర్మ్ము ప్రమాణ స్వీకారోత్సవం అత్యున్నతమైన సందర్భం: బిఎస్.రాములు



న్యూఢిల్లీ, ప్రజాపాలన ప్రతినిధి:చరిత్రాత్మకమైన జులై 25 రోజు రాష్ట్రపతి ద్రౌపది ముర్మ్మ ప్రమాణ స్వీకారోత్సవం భారత దేశంలో అత్యున్నతమైన సందర్భం ఉత్సవం అని సామాజికతత్వవేత్త , మాజీ బీసీ కమిషన్ చైర్మన్ బిఎస్ రాములు అన్నారు. ఇట్టి రోజుకూడా మీడియా లో సెన్సేషన్ కే ప్రాధాన్యత.రాష్ట్రపతి పదవీ స్వీకారం ప్రాధాన్యత లేని అంశం. రాజ్యాంగ వ్యవస్థలను మీడియా ఎంత గౌరవిస్తున్నారో! ప్రజలను మనో రంజనం, సెన్సేషన్ లు , హత్యలు ప్రమాదాలు ,ఆరోపణలకు ఇచ్చే ప్రాధాన్యత , డ్యాన్సులకు ఇచ్చే ప్రాధాన్యత రాజ్యాంగం పట్ల రాజ్యాంగం పొందుపరిచిన అంశాలకు , సందర్భాలకు ప్రచారం లేదు ప్రాధాన్యత లేదు. రాజ్యాంగ ప్రోటోకాల్స్ అనుసరించే విధంగా మీడియా స్వేచ్ఛకు విధివిధానాలు రూపొందించి అనుసరించిన వారికి ప్రకటనలను విడుదల చేసి ప్రోత్సహించాలి.దూరదర్శన్ సప్తగిరి లో లైవ్ చూపడం ద్వారా వారి బాధ్యత నెరవేర్చారు. దూరదర్శన్ యాదగిరి లో పాటలు డ్యాన్సు లు ప్రసారం చేశారు. ఇంత బాధ్యతా రాహిత్యం ఏమిటో అర్థం కాదు. వీరిపై ఏమైనా చర్యలుంటాయా? ఉండవా? తెలియదు. .ఇంత దురదృష్టకరంగా ప్రవర్తిస్తూ మీడియాలో రాజ్యాంగం గురించి, విలువలు గురించి వ్యాసాలు ప్రబోధాలు నెగెటివ్ సందర్భాలలో మాత్రం ప్రచురిస్తారు ప్రచారం చేస్తారు. భారత ప్రజాస్వామ్యం ఎంత గొప్పదో చెప్పడానికి ద్రౌపది ముర్మ్మ గారి ప్రమాణ స్వీకార సందర్భం ఉపయోగించుకోలేక పోవడం, 15 ఆగస్టు, 26 జనవరి వంటి సందర్భాలలో వాటి ప్రస్తావనే లేనిమనోరంజవ కార్యక్రమాలు ప్రసారం చేసే మీడియా, వ్యాసాలే వేయని పత్రికలతో వారు సమాజాన్ని ప్రజలను ఎటు నడిపిస్తున్నారు? ఆలోచించుకోవలసిన అవసరం ఉంది. మీడియా ఎంత రోల్ ప్లే చేస్తదో ఎలా చేస్తదో రాజకీయాల్ని ఎట్ల మలుపుతదో తెలుసుకోవాలంటే పి వి నరసింహారావు రాసిన ఇన్ సైడర్ / లోపలి మనిషి చదువాలి. కుష్వంత్ సింగ్, కుల్దీప్ నయ్యర్ పుస్తకాలు చదువాలి. ఇపుడే మీడియా ప్రజలను ఏమార్చే తీరు రాజకీయాల్లో ముసలంలను సృష్టించే తీరు మలుపు తిప్పే తీరు ప్రభావం వేసే తీరు తెలుస్తుంది. అందువల్ల రాజ్యాంగ సందర్భాల్లో రాజ్యాంపరమైవ ప్రోటో కాల్స్ జాతీయ గీతాలకు , ప్రముఖులు చనిపోయినపుడు రూపొందించినట్టు రూపొందించడం అవసరం అని ఆయన అన్నారు.

## ప్రస్తుతం కాంగ్రెస్ లో తెలంగాణ ఉద్యమకారులెవరూ లేరు

(మొదటి పేజీ తరువాయి)

త్వరలో భవిష్యత్తు కార్యాచరణ

తనకు సీఎల్పీ కావాలని గతంలో అధిష్టానాన్ని అడిగానని, అయినా తనకు ఇవ్వకుండా మల్లు భట్టి విక్రమార్కకు ఇచ్చారని, ఈ విషయంలో మొదటి నుంచి భట్టికి పూర్తి సహకారం అందించానని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చెప్పారు. తన నియోజకవర్గం ప్రజల అభిప్రాయ సేకరణ ప్రకారం త్వరలో నిర్ణయం తీసుకుంటానని క్లారిటీ ఇచ్చారు. రాబోయే రోజుల్లో మునుగోడు నియోజకవర్గ ప్రజలతో సమావేశమవుతానని చెప్పారు. ప్రస్తుతం టీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రులు కల్యాణ లక్ష్మీ చెక్కులు అందించే దుస్థితి నెలకొందన్నారు. మునుగోడు నియోజకవర్గంలో అభివృద్ధి జరగలేదన్నారు. మంత్రి జగదీశ్ రెడ్డి మునుగోడుకు 10సార్లు వచ్చినా..తాను ఒక్కసారి వెళ్లినా ఒకటే అన్నారు. టీఆర్ఎస్ నుంచి ఈటెల రాజేందర్ బయటకు వచ్చి బీజేపీలో చేరి, ఎమ్మెల్యేగా గెలిచారన్నారు. అమిత్ షా, మోడీ ద్వయంతో కేంద్ర ప్రభుత్వం బలంగా ఉంటుందని హుజురాబాద్ లో ఈటెల రాజేందర్ గెలిచారని చెప్పారు.

పార్టీ మార్పు విషయంలో కన్విన్స్ అవుతారనుకుంటా : భట్టి

ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిది కాంగ్రెస్ కుటుంబమని, సోనియాగాంధీ,రాహుల్ గాంధీపై వారికి చాలా గౌరవం ఉందని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. సీఎం కేసీఆర్ పై సీరియస్ గా కొట్లాడుదామని తనతో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. కాంగ్రెస్ తోనే రాష్ట్ర ప్రయోజనాలు సాధ్యమవుతాయని చెప్పారు. వివిధ అభివృద్ధి పనుల దృష్ట్యా ఎమ్మెల్యేలు మంత్రులను కలుస్తారని, దాంట్లో ఎలాంటి తప్పు లేదన్నారు. పదవులను చాలా మంది నాయకులు కోరుకుంటారని, కానీ అవి కొందరికే వస్తాయని అన్నారు. రాష్ట్ర ప్రజల లక్ష్యాల కోసం అందరం కలిసి పని చేద్దామని ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డితో చెప్పానన్నారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తమ కాంగ్రెస్ ఎమ్మెల్యే కాబట్టే తనతో మాట్లాడడానికి వచ్చానని, పార్టీ మార్పు విషయంలో కన్విన్స్ అవుతారని భావిస్తున్నానని చెప్పారు.

## తెలంగాణ హైకోర్టుకు కొత్తగా ఆరుగురు న్యాయమూర్తులు

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రం ఆమోదముద్ర వేసిన తరువాత ఆ పేర్లు రాష్ట్రపతి ఆమోదం కోసం వెళతాయి. రాష్ట్రపతి ఆమోదం తరువాత వారు న్యాయమూర్తులుగా ప్రమాణం చేస్తారు.

## గ్రామ వారసత్వ సంపదను అన్యాక్రాంతం కానివ్వం:ఎంపీపీ కృపేష్




ఇబ్రహీంపట్నం జూలై తేదీ 25 ప్రజాపాలన ప్రతినిధి: ఇబ్రహీంపట్నం మండలం పోచారం గ్రామంలోని గడికోట బురుజు కబ్జా చేశారని ఇబ్రహీంపట్నం ఎంపీపీ పి.కృపేష్ పై కేసు పెట్టి సోషల్ మీడియాలో వైరల్ చేశారు.

ఇదే విషయాన్ని గ్రామ పెద్దలతో కలిసి పోచారం గ్రామంలో బురుజు గడికోట లో విలేకరుల సమావేశంలో ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా కృపేష్ మాట్లాడుతూ గడికోట అనేది పోచారం గ్రామ ప్రజలు వారసత్వ సంపదని వందల సంవత్సరాల నుండి దీని కాపాడుకుంటున్న సంపద గతంలో కొందరు దుండగులు దీనికి దొంగ సర్టిఫికెట్లు సృష్టించి కబ్జాలకు గురిచేస్తున్నారని తెలుసుకొని గ్రామ పెద్దలతో కలిసి దాన్ని ఆపడం జరిగింది. అదేవిధంగా మే 10 2021 రోజున గ్రామం లో పర్యటించిన పురావస్తు శాఖ అధికారులు ప్రజల నుంచి సేకరించిన వివరాలు తో పాటు స్థలాన్ని పరిశీలించారు. పురాతన శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాములు నాయక్ మరియు తాసిల్దార్ వెంకటేశ్వర్లు ఎంపీడీవో మహేష్ బాబు కలిసి వందల ఏళ్ల చరిత్ర కలిగిన బురుజు స్థలాన్ని కబ్జా చేయాలని చూస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇది ముమ్మాటికీ గ్రామ కంఠం భూమి అని తేల్చి గ్రామ అవసరాల కోసం ప్రజల సహకారంతో ఈ భూమిని వినియోగించుకోవాలని తేల్చి చెప్పడం జరిగింది. గ్రామ అభి వృద్ధి కోసం పాటుపడుతున్న నాపై దుష్ప్రచారం చేస్తూ కొందరి ప్రోద్బలంతో రాజకీయంగా దెబ్బతీయాలని కొందరు భూఆక్రమణ దారులు కేసు పెట్టారని విచారణ జరిపి వెంటనే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కృపేష్ తెలిపారు గ్రామ ప్రజలు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు .

## రాష్ట్రపతి ప్రమాణ స్వీకారంలో భాగమైనందుకు ఆనందంగా ఉంది: డా.కె.లక్ష్మణ్

న్యూఢిల్లీ, ప్రజాపాలన ప్రతినిధి: న్యూఢిల్లీలోని పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో భారత రాష్ట్రపతిగా ద్రౌపది ముర్మ్మ ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగమైనందుకు ఆనందంగా ఉందని బీజేపీ ఎంపీ డా.కె.లక్ష్మణ్ తెలిపారు. భారత రాష్ట్రపతి చద్రౌపదిముర్మ్మ జీ: గిరిజన సంఘం నుండి భారతదేశపు మొదటి రాష్ట్రపతి అన్నారు. స్వాతంత్ర్యం తర్వాత జన్మించిన మొదటి రాష్ట్రపతి అని డా.లక్ష్మణ్ కూ యాప్ ద్వారా తెలిపారు.

మాస్టర్ కీ TV
(అంబేడ్కర్ TV)
జై భీం,
మీరు నాయకుడిగా ఎదగాలని అనుకుంటున్నారా...?
మీరనుకున్న వార్తలు రావాలని కోరుకుంటున్నారా...?
పెట్టుబడి లేకుండా ఆదాయం పొందాలని అనుకుంటున్నారా...?
మీరూ మీ అసెంబ్లీ నియోజకవర్గం లో
టీవీ ఛానల్ ఓనర్ గా కావాలని అనుకుంటున్నారా...?
అయితే రండి, కదలి రండీ
బహుజనాభివృద్ధే.. దేశాభివృద్ధి అని నిరూపిద్దాం
1. ఈ దేశంలో ఉన్న ఫోర్త్ ఎస్టేట్ (మీడియా రంగం) బహుజనుల సమస్యల మీద ప్రచారం చేయడం లేదని మీ అందరికీ తెలుసు. దేశంలోనే మొట్ట మొదటిసారిగా విలేఖరులకు సామాజిక కార్యకర్తలకు, అంబేడ్కర్, ఫూలే సంఘం నాయకులకు, కనీసం 100 మంది తెలిసిన గ్రూపునాయకులకు టీవీ ఛానల్ ప్రతినిధిగా / యజమానిగా అవకాశం ఇవ్వబడును.
2. జీవిత కాలంలో ఆయా అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రతినిధిగా / యజమానిగా నియమించబడును.
3. ఆయా ప్రతినిధికి ప్రకటనల ఆదాయం (Advertising Revenue)లో ప్రకటనలపై 40% ఆదాయం ఇవ్వబడును.
4. వార్తలను స్వేచ్ఛాయతంగా ప్రసారం (Telecast) చేసే వీలు కల్పించబడును.
సంప్రదించండి
Tel No: 9849031420 ,9440918143, 94409 18371, 94400 53858, 93473 50692,8008840506, 9440077239, 7798832998, 76600 27678,
Office: Ambedkar TV Channel, 3rd Floor, Dault Plaza, Main Road, Besides Bata Showroom, Lakdi ka pool, Hyderabad - 500004
E- mail : ambedkartvchannel2018@gmail.com www.ambedkartv.org

ప్రజాపాలన

సంపాదకీయం

మంగళవారం 26, జులై 2022

# శ్రావణ మేఘాలు

శ్రావణమాసం కొద్దిరోజుల్లోనే రానుంది. ఇది ప్రకృతి మేఘమల్హారాలాపనతో పరవశించే మాసం. శ్రావణమాసానికి ఆధ్యాత్మిక విశేషాలు ఎన్నో ఉన్నాయి. శ్రావణమాసంలో నోములు, వ్రతాలు విరివిగా జరుపుకొంటారు. వాయనాల్లో మొలకెత్తిన శనగలను ఇచ్చిపుచ్చుకుంటారు. నోములు, వ్రతాలు జరుపుకొనే మహిళలు పట్టుచీరలతోను, నగలతోను కళకళలాడుతూ కనిపిస్తారు. ఇందుకే శ్రావణమాసాన్ని 'నగల మాసం, శనగల మాసం' అంటూ చమత్కరించారు ముళ్లపూడి వెంకటరమణ. ఆధ్యాత్మిక విశేషాలను పక్కన పెడితే, శ్రావణమాసంలో కనిపించే కారుమబ్బులు, అవి కురిపించే కుండపోత వర్షాలు ప్రకృతి గమనంలోని సహజ పరిణామాలు. మేఘసౌందర్యాన్ని వర్ణించని కవులు అరుదు. 'నల్లని మబ్బులు గుంపులు గుంపులు, తెల్లని కొంగలు బారులు బారులు' అంటూ కారుమబ్బుల అందాలను కళ్లముందు నిలిపారు కృష్ణశాస్త్రి. మేఘాల గురించి 'గాథా సప్తశతి'లో ఒక అరుదైన, అపురూపమైన వర్ణన ఉంది. 'అవిరల పడంత నవజల ధారా రజ్జు ఘడిఅం పఅత్తేణ/ అపహుత్తో ఉఖేతుం రస ఇవ మేహో మహింవు అహ'. అంటే, వర్షధారల దారాలతో భూమిని బంధించి పైకి లాగేయడానికి మేఘం విఫలయత్నం చేస్తోంది. ఈ ప్రయత్నంలో మేఘం ఎంతో కష్టపడుతోంది. అందుకు నిదర్శనం– అది చేస్తున్న ఉరుముల హూంకారాలే! ఇంతటి కవి చమత్కారం మరే భాషా సాహిత్యంలోనూ కనిపించదు. మబ్బులు కమ్ముకున్నాక, అవి ఉరుములు ఉరమడం, మెరుపులు మెరవడం, చినుకులు కురవడం సహజమే! అలాగని ప్రతి మబ్బూ వాన కురుస్తుందనే భరోసా ఏమీ లేదు. మబ్బుల్లో నాలుగు రకాలు ఉంటాయని, అలాగే మనుషుల్లోనూ నాలుగు రకాలు ఉంటారని బుద్ధుడు తన శిష్యులకు ఎరుకపరచాడట! ఉరుములు ఉరిమినా చినుకు కురవకుండానే వెళ్లిపోయేవి ఒకరకం, ఉరుములు మెరుపులు లేకపోయినా చినుకులు కురిసిపోయేవి మరోరకం, ఉరుములు మెరుపుల సందడితో వాన హోరెత్తించేవి ఒకరకం, ఉరుముల శబ్దం చేయకుండా, చినుకైనా కురవకుండా తేలిపోయేవి ఇంకోరకం. మేఘాల స్వభావం లాగానే మనుషుల స్వభావాలూ ఉంటాయి. ఊరకే నీతులు చెబుతూ ఆచరించని వాళ్లు ఒక రకం, శాస్త్రాలు చదువుకున్నా వాటి సారాన్ని గ్రహించని వాళ్లు ఇంకో రకం. శాస్త్రాలు చదవకున్నా, ధర్మసారాన్ని గ్రహించి ఆచరించేవాళ్లు ఒకరకం, శాస్త్రాలు చదివి, వాటి సారాన్ని గ్రహించి ఆచరించేవాళ్లు మరోరకం. సాహిత్యంలోను, కళల్లోను మబ్బులు రకరకాల భావనలకు సంకేతాలుగా చలామణీలో ఉన్నాయి. దిగులుకు, దుఃఖభారానికి, అంతుచిక్కని రహస్యానికి, అనిశ్చితికి, ప్రతికూల పరిస్థితులకు సంకేతంగా మబ్బులను పోల్చుతారు. అంతేకాదు, మబ్బులు క్షాళనకు కూడా సంకేతాలు. మబ్బులు కురిపించే వానలో నేల మీద ఉన్న చెత్తాచెదారం కొట్టుకుపోయినట్లే, దుఃఖ వర్షం తర్వాత గుండెలో గూడు కట్టుకున్న దిగులు కొట్టుకుపోయి మనసు తేటపడుతుందని కొందరి భావన. 'భారమైన హృదయాలు దట్టమైన మబ్బుల్లాంటివి. వాటి నుంచి కాస్త నీటిని బయటకు పోనిస్తేనే మంచిది. అప్పుడే ఊరట చెందుతాయి' అంటాడు అమెరికన్ రచయిత క్రిస్టఫర్ మోర్లే. మేఘతతులు ఎరుకకు, పరివర్తనకు, కలలకు కూడా సంకేతాలు. అయితే, ఎక్కువగా మబ్బులను దిగులుకు, ప్రతికూలతలకు సంకేతంగానే భావిస్తారు. సాహిత్యంలోనూ ఇలాంటి వర్ణనలే కొంత ఎక్కువగా కనిపిస్తాయి. 'భారమైన మేఘాలు నక్షత్రాలను ఆర్పేస్తున్నాయి' అని తన 'నైట్ ఫ్లైట్' నవలలో వర్ణించాడు ఆంటోయిన్ డి సెయింట్ ఎక్సుపెరీ. పైలట్‌గా పనిచేసినప్పుడు నక్షత్రాలను మేఘాలు కమ్మేసిన దృశ్యాలను క్లోజప్‌లో చూసిన అనుభవం ఉన్నవాడాయన. దట్టంగా కమ్ముకున్న మబ్బులు పగలు సూర్యుణ్ణి, రాత్రి చంద్రుణ్ణి, నక్షత్రాలను కనపించనివ్వవు. అలాగని ఆకాశంలో సూర్యచంద్రులు, నక్షత్రాలు అదృశ్యమైపోవు. తాత్కాలికంగా అలా అనిపిస్తాయంతే! మబ్బులు మటుమాయం కాగానే, మళ్లీ తమ సహజకాంతులతో కనిపిస్తాయి. గుండెలోని గుబులు, మనసులోని దిగులు కూడా అంతే! దిగులు మబ్బులు కమ్ముకున్నంత మాత్రాన మనసులోని ఆశలు పూర్తిగా అడుగంటిపోవు. అందుకే, 'మబ్బులకు ఆవల సూర్యుడు నిరంతరం వెలుగుతూనే ఉంటాడు' అంటాడు అమెరికన్ రచయిత పాల్ ఎఫ్. డేవిస్. ఉరిమే ప్రతి మబ్బూ కురవదని లోకోక్తి. వ్యర్థ ప్రసంగాలతో హోరెత్తించే వారికి ఇది చక్కగా వర్తిస్తుంది. 'వాగ్దానం మబ్బు మాత్రమే, అది నెరవేరినప్పుడే వాన కురిసినట్లు' అని ఇంగ్లిష్ సామెత. వాగ్దానకర్ణులైన రాజకీయ నాయకులకు ఇది అక్షరాలా సరిపోతుంది. 'ఎంతటి రాగి గొలుసులతోనైనా మబ్బులను బంధించలేము' అనే సామెత కూడా ఉంది. నింగిలోని మబ్బులు స్వైరవిహారం జరిపే స్వేచ్ఛాసంచారులు. వాటి మానాన అవి ముందుకు సాగుతూనే పోతాయి. ప్రపంచంలో వాటిని బంధించే శక్తి ఏదీ లేదు. ఎక్కడైనా, ఎవరైనా స్వాభావికమైన స్వేచ్ఛను బంధించబూనితే, దాని పర్యవసానం మేఘవిస్ఫోటనం కూడా కావచ్చు! ఇటీవల శ్రావణ భార్గవి అనే గాయని అన్నమయ్య కుమారుడు పెద తిరుమలాచార్యుని పదాన్ని పాడిన వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల్లో అనవసర దుమారానికి దారితీసింది. కొందరి అభ్యంతరాల ధాటికి ఆమె వెనక్కు తగ్గి, ఆ వీడియోను తొలగించింది. ఈ దుమారం సద్దుమణిగినా ఇదంత మంచి సంకేతం కాదు. ప్రజాస్వామ్య ప్రభలను మూకస్వామ్య దౌర్జన్యపర్వాన్నాలు కబళించడం వాంఛనీయం కాదు.

# పార్లమెంట్ పనితీరు ఇలాగేనా?

భారత 75వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆజాదీ కా అమృత్ మహోత్సవాలను జరుపుకొంటున్నాం. మరోవైపు పార్లమెంటు శీతాకాల సమావేశాలు ప్రారంభమయ్యాయి. మన పార్లమెంట్ పనితీరు ఎంత సమర్థంగా ఉంటోందని ప్రశ్నించుకోవడానికి ఇంతకంటే సముచిత సందర్భం మరొకటి దొరకదు. 1950లు, 60లలో అంటే స్వాతంత్ర్యానంతర కాలపు లోక్‌సభలు దాదాపుగా సగటున నాలుగు వేల గంటలు పనిచేశాయి. కానీ అయిదేళ్ల పాటు పూర్తికాలం పనిచేసిన 16వ లోక్‌సభ కేవలం 1,615 గంటలపాటు మాత్రమే పనిచేసింది. అలాగే, లోక్‌సభ ముఖ్యమైన విధులు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయి. వీటిలో ఒకటి %--% చట్టాలను ఆమోదించడం. వీటికి సంబంధించి తగినంత చర్చ జరగడం లేదు. తొలి రెండు లోక్‌సభా కాలాల్లో 71 శాతం, 60 శాతం బిల్లులను కమిటీల పరిశీలనకు పంపేవారు. కానీ ఇప్పుడు మాత్రం 25 శాతం బిల్లులను మాత్రమే కమిటీల పరిశీలనకు పంపుతున్నారు. అంటే శాసనం అవసరమైనంత మేరకు తనిఖీకి గురవుతోందా అనేది ప్రశ్న. ప్రస్తుతం పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు కొనసాగుతున్నాయి. అదే సమయంలో మనం ఇప్పుడు 75వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకోనున్నాం. ఈ సందర్భంగా పార్లమెంట్ పనితీరు ఎంత సమ ర్థంగా ఉంటున్నదని ప్రశ్నించడం ఎంతో సముచితంగా ఉంటుంది. మనం పెట్టుకున్న అంచనాలను భారత పార్లమెంట్ నెరవేరుస్తోందా లేక మనల్ని నిరాశపరుస్తోందా? దీనికి సంబంధించి ఢిల్లీకి చెందిన స్వచ్ఛంద సంస్థ 'పీఆర్ఎస్'(పాలసీ రీసెర్చ్ స్టడీస్) లెజిస్లేటివ్ రీసెర్చ్ నుంచి సేకరించిన గణాంకాలు ఆందోళన కలిగించే ప్రశ్నలను లేవ నెత్తడమే కాదు... మనకు కలవరం కలిగించే నిర్ధారణలను కూడా ఇస్తున్నాయి.



**తగ్గిన పనిగంటలు**

ముందుగా మనం లోక్‌సభతో ప్రారంభిద్దాము. అయిదేళ్లపాటు పూర్తి కాలం పనిచేసిన 16వ లోక్‌సభ 1,615 గంటలపాటు పనిచేసింది. అంతకుముందు పూర్తికాలం పనిచేసిన లోక్‌సభలతో పోలిస్తే 16వ లోక్ సభ 40 శాతం తక్కువగా పనిచేసింది. 1950లు, 1960ల నాటి లోక్‌సభలు దాదాపుగా సగటున 4,000 గంటలపాటు పనిచేస్తూ వచ్చాయి. కానీ ప్రస్తుతం లోక్‌సభ పనిచేసే సమయం బాగా తగ్గి పోతోందని అర్థమవుతుంది. లోక్‌సభ ముఖ్యమైన విధులు రెండూ ఇప్పుడు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయి. వీటిలో మొదటిది, చట్టాలను ఆమోదించడం. 15వ లోక్‌సభలో 26 శాతం బిల్లులు 30 నిమిషాలలోపే ఆమోదం పొందేవి. అదే 16వ లోక్‌సభలో 6 శాతం బిల్లులు 30 నిమిషాల లోపు ఆమోదం పొందగలిగాయి. ఇక దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక తొలి రెండు లోక్‌సభా కాలాల్లో 71 శాతం, 60 శాతం బిల్లులను కమిటీల పరిశీలనకు పంపేవారు. కానీ ఇప్పుడు మాత్రం 25 శాతం బిల్లులు మాత్రమే కమిటీల పరిశీలనకు పంపు తున్నారు. అంటే శాసనం అవసరమైనంత మేరకు తనిఖీకి గురవు తోందా అనేది ప్రశ్న.

**తగ్గిన ప్రశ్నలు**

ఇక లోక్‌సభ రెండో ముఖ్యమైన విధి ఏమిటంటే, ప్రభుత్వాన్ని జవాబుదారీతనంలో ఉంచటమే. కానీ గత నాలుగు లోక్‌సభల్లో ప్రశ్నోత్తరాల సమయం దానికి కేటాయించిన సమయంలో 59 శాతం వరకు మాత్రమే పనిచేసింది. ఇక రాజ్యసభలో అది 41 శాతానికి పడిపోయింది. సభలో నిత్యం కలిగే అంతరాయాలు ప్రశ్నించే అవకాశాన్ని హరించి వేస్తున్నాయి. నిస్సందేహంగా ఎంపీల ప్రవర్తనను దీనికి కొంతవరకు నిందించాల్సి ఉంటుంది. కానీ, సభను క్రమ శిక్షణలో పెట్టడంలో స్పీకర్ పక్షపాతపూరిత వైఫల్యమే దీనికి ప్రధాన కారణం అని చెప్పాలి. ఇక రాష్ట్రాల శాసనసభల్లో పరిస్థితి మరింత ఘోరంగా తయారైంది. గత సంవత్సరం శాసనసభలు సగటున 21 రోజులు మాత్రమే పనిచేశాయి. 2020లో రాష్ట్రాల శాసనసభల్లో ఆమోదం పొందిన బిల్లుల్లో సగం పైగా వాటిని ప్రవేశపెట్టిన రోజే ఆమోదం పొందాయి.

**స్వేచ్ఛ లేదు!**

ఇక ప్రత్యేకించి ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, పార్లమెంట్ సభ్యులు ఇప్పుడు ఊపిరాడని స్థితిలో ఉండటమే! దీనికి ఫిరా యింపుల చట్టమే కారణమని నేరుగా ఆరోపించవచ్చు. తమ అభిప్రాయాన్ని వ్యక్తీకరించే హక్కు ఉన్న ప్రజాప్రతినిధులు వీరు అని అందరూ చెప్పుకుంటుంటారు. కానీ తమ పార్టీ నాయకత్వానికి వారు బానిసలుగా మారిపోయారు. ఎందుకంటే తమ పార్టీ జారీచేసే విప్‌కి భిన్నంగా ఎంపీలు ఓటు వేయడాన్ని ఈ ఫిరాయింపుల చట్టం నిరోధిస్తోంది. ఫిరాయింపుల చట్టం పార్లమెంట్, రాష్ట్రాల శాసన సభల స్వభావాన్ని ప్రాథమికంగా మార్చివేసిందని పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ సంస్థకు చెందిన చక్షు రాయ్ చెబుతున్నారు. ఎంపీలకు వారి స్వాతంత్ర్యాన్ని వారికి ఇవ్వడానికి, ఫిరాయింపుల వ్యతిరేక చట్టాన్ని ఫైనాన్స్ బిల్లులకూ, అవిశ్వాస తీర్మానం సమయంలో ఓట్లకూ మాత్రమే పరిమితం చేయాల్సిన అవసర ముంది. ఇతర అంశాలపై వారి పార్టీ నాయకత్వంతో విభేదించేం దుకు వారిని స్వేచ్ఛగా వదిలిపెట్టాలి.

**అభిప్రాయ మార్పిడి జరగాలి**

ఇక రాజ్యసభలో పరిస్థితి మరింత ఘోరంగా ఉంటోంది. రాజ్యాంగపరంగా రాజ్యసభ అంటే ఒక సవరించే ఛాంబర్ అని అర్థం. లోక్‌సభ ఆమోదించిన శాసనం ఇక్కడ పునరాలోచనకు గురి కావచ్చు. అలాగే రాష్ట్రాల ఆందోళనలను వ్యక్తీకరించే చాంబర్‌గా కూడా ఇది వ్యవహరిస్తుంది. 2003లో బిల్లు ఆమోదం పొందిన తర్వాత ఫిరాయింపు వ్యతిరేక చట్టం, పార్లమెంట్ మొట్టమొదటి విధిని ఛిన్నాభిన్నం చేసివడేసింది. ఇది రాష్ట్రాలకూ, రాజ్యసభ అభ్యర్థులకూ మధ్య లింకును బద్దలు చేసేసింది. అంటే రాష్ట్ర ప్రాతినిధ్యాన్ని తీవ్రంగా బలహీనపర్చింది. అంటే రాజ్యసభ తన ఉనికికి సంబంధించిన హేతువును కూడా కోల్పోయినట్లేనా? స్వాతంత్ర్యానంతరం భారత పార్లమెంట్ అభివృద్ధి చెందిన తీరును మీరు గమనించినప్పుడు, ఎంపీలను పణంగా పెట్టి పార్టీ నాయకత్వాలు బలం పుంజుకున్నాయి. శాసన సభ్యులను పణంగా పెట్టి రాజకీయ పార్టీలు బలపడుతూ వచ్చాయని అర్థమవుతుంది. కాబట్టి బ్రిటన్ హౌస్ ఆఫ్ కామన్స్ నుంచి మనం రెండు సంప్రదాయాలు తీసుకోవాలి. ప్రస్తుత దుష్ఫలితాలను నివారించడానికి అవి మనకు సహాయం చేయవచ్చు. ప్రధానమంత్రి ప్రతివారం ప్రశ్నోత్తరాల సమయంలో నేరుగా పాల్గొనే చరిత్ర బ్రిటన్‌కు ఉంది. దీనిలో ప్రధాన మంత్రికీ, ప్రతిపక్ష నాయకుడికీ మధ్య ప్రత్యక్ష అభిప్రాయాల మార్పిడి ఉంటుంది. ఇది భూమ్మీద అతి శక్తిమంతమైన రాజ్యాన్ని ప్రశ్నించే అవకాశం ప్రతిపక్షానికి అందిస్తుంది. భారత్‌లో మనకు కూడా సరిగ్గా అలాంటి అవకాశం ఉండాల్సిన అవసరం ఉంది.

**మెరుగుపడాలి!**

మరో సంప్రదాయం స్పీకర్‌కి సంబంధించింది. బ్రిటన్‌లో ఒకసారి ఎన్నికయ్యాక స్పీకర్ తన పార్టీ నుంచి రాజీనామా చేస్తారు. సిట్టింగ్ స్పీకర్ రీ%--%ఎలక్షన్‌కు నిలబడినట్లయితే ఎవరూ ఆయనపై పోటీ చేయరు. దీనివల్ల స్పీకర్‌కూ, తన పార్టీకీ మధ్య లింకు తెగిపోతుంది. అంటే తాను పక్షపాత రహితంగా కచ్చితంగా ఉండే అవకాశం ఉంటుంది. మనం చేపట్టాల్సిన మరొక మంచి సంప్రదాయం ఇది. అంతిమంగా, పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ సంస్థ నిజంగా సమా ధానం చెప్పలేని ప్రశ్న ఒకటి ఉంది. అదేమిటంటే, గత 75 సంవ త్సరాల్లో మన ఎంపీల నాణ్యత, ప్రతిభ, సామర్థ్యం మెరుగు పడ్డాయా? ఏడు దశాబ్దాల క్రితం నాటి కంటే మెరుగైన, ప్రతిభా వంతులైన పార్లమెంట్ ఎంపీలు మనకు ఇప్పుడు ఉన్నారా? 1947 నుంచి సమయం, చర్చ, భద్రత విషయంలో పార్లమెంట్ పనితీరు క్షీణించి పోయిందా అంటే... ఈ ప్రశ్నకు సమాధానం అవును అని రాకుండాపోయే అవకాశం తక్కువ.

# ధరల పెరుగుదల, జిఎస్‌టి పెంపు : ప్రజలపై క్రూరమైన దాడి

ఈ ప్రభుత్వమే 2019లో కార్పొరేట్ పన్నులు తగ్గించింది. దాంతో రూ. 1.45 లక్షల కోట్ల ఆదాయం నష్టపోయింది. కార్పొరేట్లకు వరుసగా రుణాల రద్దులను ప్రకటించింది. సంపన్నులు బ్యాంకులకు బకాయిపడి కట్టనటువంటి రుణాల మొత్తం రూ. 2.4 లక్షల కోట్లుగా వుంది. ఇటువంటి రాయితీలు, బెయిలవుట్ల వల్ల నష్టపోయిన ఆదాయాన్ని భర్తీ చేసుకోవడానికి, పెట్రోలియం ఉత్పత్తులపై పన్నులు, ఆహార పదార్థాలపై, ప్రజలు ఎక్కువగా వినియోగించే వస్తువులపై జిఎస్‌టి రేట్లు పెంచడం వంటి పరోక్ష పన్నులతో క్రూరమైన దాడి జరుపుతోంది. వాణిజ్య, కరంట్ అకౌంట్ లోట్లు పెరిగిపోతున్న నేపథ్యంలో మొదటిసారిగా డాలరుతో రూపాయి మారకం 80 దాటింది. రూపాయి విలువ నిరంతరం క్షీణిస్తూ వుండడం ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు పెరగడానికి దారితీస్తోంది. దీనికి తోడు ఇప్పటికే వున్న ద్రవ్యోల్బణం, అధిక నిరుద్యోగం ఇవన్నీ చూస్తుంటే, మోడీ ప్రభుత్వం బడా వ్యాపారవేత్తలకు అనుకూలంగా వుండే విధానాలను అనుసరించడం వల్ల ఆర్థిక వ్యవస్థ ఎలా పక్కదారులు పడుతోందో తెలియచేస్తోంది. టోకు, రిటైల్ ద్రవ్యోల్బణ రేట్లు వరుసగా 15 శాతం, 7 శాతంగా కొనసాగుతునే వున్నాయి. ఫలితంగా అన్ని నిత్యావసర వస్తువుల ధరలు ముఖ్యంగా ఆహార పదార్థాల ధరలు అడ్డూ అదుపు లేకుండా పెరిగిపోతున్నాయి. వీటికి అదనంగా, పెరుగుతూ పోతున్న ఇంధన ధరల భారం ప్రజలపై పడుతూనే వుంది. వంట గ్యాస్ సిలిండర్ల ధరలు కూడా విపరీతంగా పెరిగిపోయాయి. గత మూడేళ్ళుగా రూపాయి విలువ క్షీణిస్తూనే వస్తోంది. ఇందుకు అనేక కారణాలు వున్నాయి. బ్యాలెన్స్ ఆఫ్ పేమెంట్ల(చెల్లింపుల సమతూకం)కి సంబంధించి వాణిజ్య, కరంట్ అకౌంట్ లోటు పెరిగిపోవడం వీటిలో ముఖ్యమైన కారణంగా వుంది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను పెంచినప్పటి నుండి విదేశీ పోర్టుఫోలియో పెట్టుబడులు నిష్క్రమించడం ప్రస్తుతం రూపాయి విలువ తగ్గడానికి ప్రధాన కారణంగా వుంది. ఉదాహరణకు, ఈ ఏడాది ఇప్పటి వరకు ఈక్విటీలను విక్రయించడం ద్వారా 3 వేల కోట్ల డాలర్లను విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు తీసేసుకున్నారు. పెద్ద మొత్తంలో విదేశీ మారక నిల్వలు వున్నందున బహిరంగ మార్కెట్‌లో జోక్యం చేసుకోవడం ద్వారా భారత రిజర్వ్ బ్యాంక్ రూపాయి క్షీణతను అడ్డుకోవచ్చు. కానీ అలా చేయకుండా, ఏవో కొన్ని సందర్భాల్లో మినహాయించి చాలాసార్లు...భారత ఎగుమతుల పోటీని పెంచేందుకు, వాణిజ్య లోటును తగ్గించేందుకుగానూ ...రూపాయిల్లో దిగుమతులు మరింత వ్యయ భరితమయ్యేలా చేసేందుకు రూపాయి విలువ క్షీణించడానికి ఆర్‌బిఐ అనుమతించిందని అర్థమవుతోంది. కానీ, రూపాయి విలువ క్షీణించడమనేది ప్రధానంగా పెట్టుబడులు తరలిపోవడం, అలాగే విదేశీ పోర్టుఫోలియో పెట్టుబడులు వెళ్ళిపోవడం వల్ల జరిగింది. అందువల్ల రూపాయి విలువ తగ్గడం వాణిజ్య లోటు తగ్గడానికి దారి తీయదు. రూపాయి విలువ క్షీణత ప్రభావం దేశవ్యాప్తంగా పడనుంది. ఎందుకంటే, దీనివల్ల దిగుమతుల వ్యయం పెరిగిపోనుంది. దిగుమతి చేసుకునే ఎరువులు, పెట్రోలియం ఉత్పత్తులపై అధిక మొత్తంలో సబ్సిడీల కారణంగా సబ్సిడీల భారం పెరిగిపోనుంది. అందువల్ల సబ్సిడీలను తగ్గించాలని ప్రభుత్వం భావిస్తోంది. సాధారణ ద్రవ్యోల్బణం, ధరల పెరుగుదలకు ఇది కూడా తోడైంది. అధిక ధరల కారణంగా సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న సమయంలో వివిధ వస్తువులపై జిఎస్‌టి రేట్ల పెంపు భారాన్ని ప్రభుత్వం మోపింది. మొదటిసారిగా, ముందుగానే ప్యాక్ చేసి పెట్టే తృణధాన్యాలు, పప్పు ధాన్యాలు, పెరుగు, పన్నీర్, మాంసం, చేపలు వంటి కొన్ని ఆహార ఉత్పత్తులపై 5 శాతం పన్ను విధించింది. శవ దహన చార్జీలు, ఆస్పత్రి పడకలు, చెక్కుల ద్వారా చెల్లింపులతో సహా ఇతర సర్వీసులపై కూడా జిఎస్‌టి రేట్లు పెరిగాయి. పన్నులు వేసి ఆహార పదార్థాల ధరలు పెంచడం ద్వారా ప్రజలపై ఇలాంటి భారాలు మోపడం గురించి నిర్లక్ష్యపూరితమైన ప్రభుత్వమే పరిశీలిస్తుంది. జిఎస్‌టి కౌన్సిల్ ఆమోదించిన కొత్త జిఎస్‌టి ప్రతిపాదనలు ఏకాభిప్రాయంతో తీసుకున్నవని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. ఏ రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన ప్రతినిధీ ఈ ప్రతిపాదనలను వ్యతిరేకించలేదన్నారు. ఇది పూర్తిగా అవాస్తవం. జిఎస్‌టి రేట్ల సవరణ అమలుపై వేసిన మంత్రుల బృందం (జిఓఎం)లో కేరళ ఆర్థిక మంత్రి కె.ఎన్. బాలగోపాల్ సభ్యుడిగా వున్నారు. ఈ ప్రతిపాదనలపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ, గతేడాది నవంబరు 29నే ఆయన ఒక లేఖ రాశారు. సామాన్యుడిపై భారం మోపకుండా జిఎస్‌టి వ్యవస్థ ద్వారా ఆదాయాలను పెంచుకోవడమెలా అనే అంశంపై మరింత సవివరమైన అధ్యయనం జరపాలని కోరారు. కేరళ ప్రభుత్వ వైఖరిని పునరుద్ఘాటిస్తూ, జూన్ 17న జరిగిన చివరి మంత్రుల బృందం సమావేశానికి ఈ లేఖను మళ్ళీ పంపారు. చండీగఢ్‌లో జరిగిన జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో మొత్తంగా అన్ని ఆహార పదార్థాలపై జిఎస్‌టి రేట్లు పెంచాలన్న నిర్ణయం చూస్తే, కౌన్సిల్‌లో నిర్ణాయక క్రమం ఎంత అపారదర్శకంగా వుందో స్పష్టమవుతోంది. కుటుంబశ్రీ వంటి సంస్థలు లేదా చిన్న దుకాణాల్లో ఒకటి లేదా రెండు కిలోలు ప్యాకెట్లలో విక్రయించే ఆహార పదార్థాలపై ఎలాంటి పన్ను విధించరాదని కేరళ ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. ఆహార పదార్థాలపై పన్ను విధించరాదని, గృహ వినియోగదారీ వస్తువులపై తక్కువ జిఎస్‌టి విధించాలనేటువంటి సరైన వైఖరిని... గత ఎల్‌డిఎఫ్ ప్రభుత్వ హయాంలో కేరళ ఆర్థిక మంత్రిగా థామస్ ఐజాక్ వున్నప్పటి నుండి కేరళ ప్రభుత్వం తీసుకుంటూ వస్తోంది. వీటిపై పన్ను విధించడానికి బదులుగా ముందుగా విధించిన 28 శాతం స్లాబ్‌ను పునరుద్ధరించడం ద్వారా విలాసవంతమైన వస్తువులపై పన్ను రేటును పెంచాలని సూచించింది. అయితే, సంపన్నులపై, విలాసవంతమైన వినియోగంపై పన్నులు వేయాలని మోడీ ప్రభుత్వం భావించడం లేదు. ఈ ప్రభుత్వమే 2019లో కార్పొరేట్ పన్నులు తగ్గించింది. దాంతో రూ. 1.45 లక్షల కోట్ల ఆదాయం నష్టపోయింది. కార్పొరేట్లకు వరుసగా రుణాల రద్దులను ప్రకటించింది.

# అర్చక సమాఖ్య జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గంగు ఉపేంద్ర శర్మ వెల్లడి



కరీంనగర్ జూలై 25 ప్రజాపాలన : రాష్ట్రంలోని అర్చకుల సంక్షేమాభివృద్ధి కోసం తగిన నిధులు మంజూరు చేసేందుకురాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయం ఉందని అర్చక సమాఖ్య జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గంగు ఉపేంద్ర శర్మ అన్నారు. సోమవారం స్థానిక రాజరాజేశ్వర కళ్యాణ మంటపంలో జరిగిన అర్చక వేల్ఫేర్ బోర్డ్ సభ్యుల అభినందన సభకు ఆయన ముఖ్య తిథిగా హాజరయ్యారు. ఈ సందర్బంగా శర్మ మాట్లాడుతూ రాష్ట్రంలో అర్చకుల అన్ని విధాల ఆదుకునేందుకు సిఎం కేసీఆర్ ఇప్పటికే అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టాడని,అవి దశల వారిగా అమలవుతాయని శర్మ ఆశాభావం వ్యక్తం చేశారు.అర్చక సంక్షేమనిధికి సంబందించిన ముసాయిదా సిఎం కార్యాలయంలో సిద్దంగా ఉందన్నారు.అది అమలైతే అర్చక కుటుంబాల జీవితాలు మరింత మెరుగు పడనున్నాయన్నారు. ఇప్పటికే ప్రభుత్వం అర్చకుల ఉపాధి కోసం దూప దీప నైవేద్యం కార్యక్రమం ప్రవేశ పెట్టి ఎన్నోఅర్చక కుటుంబాలను ఆదుకున్న ఘనత సిఎం కేసీఆర్ కు దక్కిందన్నారు. రాష్ట్రంలోని యావత్తు అర్చక కుటుంబాల జీవితాల బధ్రత కోసం లక్షా అరవై వేల కోట్ల రూపాయలతో భీమా పథకాన్ని రూపొందించారన్నారు.ఏ అర్చకుడు ప్రమాదవ రణించిన అతని కటుంబానికి పది లక్షల రూపాయలతో ప్రమాద భీమాను ప్రభుత్వం వర్ధింప చేయనుందని ఆయన స్పష్టం చేశారు. అంతే కాకుండా అర్చక కుటుంబంలోని ఆడపిల్ల వివహానికి ఐదు లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించేందుకు సిఎం కేసీఆర్ హామీ ఇచ్చారని అది త్వరలో అమలు కానుంగన్నారు. అర్చకుల మౌళిక నదుపాయాలు కల్పించేందుకు దేవాదాయ శాఖ అధికారులు కూడా హామి ఇచ్చారన్నారు.రానున్న రోజుల్లో అర్చక కుటుంబాల బతుకులు మెరుగయ్యేందుకు ప్రభుత్వం పక్కా కార్యచరణ ప్రణాలిక రూపొందించిందని, త్వరలో దశలవారిగా ఆ పథకం అమలు కానుందని శర్మ అర్చకుల కడు హామి ఇచ్చారు. అర్చకులు కూజా దూప దీప నైవేద్య కార్యక్రమాలను తమవంతు బాద్యతోనిర్వహించి భక్తుల అధాభిమానాలతో పాటు ప్రభుత్వ గుర్తింపు పొందాలన్నారు. ప్రభుత్వం రూపొందించిన భక్తి కార్యక్రమాలను బాధ్రాతా యుతంగానిర్వహించి మంచి పేరు ప్రతిష్టలు అందుకోవాలన్నారు. రాను రోజుల్లో అర్తకుల దూప దీప నైవేద్యం వేతనాలను పెంచే విదంగా ప్రభుత్వంతో చర్చలు కొనలాహుతున్నాయని,అవి సఫలీ కృతం అయ్యే కమ కృషిని అందిస్తానన్నారు.అనంతరం అర్చక వేల్ఫేరు బోర్డు ఉమ్మడి జిల్లా నుండి జక్కాపురం నారాయణస్వామి ఎంపిక కావడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. అనంతరం బోర్డ్ సభ్యడు నారాయణ స్వామిని అర్చక సంఘం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ధూప దీప నైవేద్య రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస సుదర్శన్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి నాగరాజు మధుసూదనాచార్య, గౌరవ అధ్యక్షులు ఏటూరి ఆంజనేయ చారి, జిల్లా అధ్యక్షులు నాగరాజు మహేంద్ర చార్య, రాహులా ఆచార్య, గూడెం గుట్ట కొండగట్టు ఆస్థాన ఆచార్యులు గోవర్ధన, సంపత్ కుమార్, కవీంద్ర ఆచార్యులు, జక్కాపురం నారాయణస్వామి జిల్లాల నుండి వచ్చిన అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## ఐదు మల్టి నేషనల్ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించిన యువతిని అభినందించిన జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్



రాయికల్, జూలై 25 (ప్రజాపాలన ప్రతినిధి): రాయికల్ పట్టణానికి చెందిన రుద్రరచన చిన్ననాడే తల్లిదండ్రులనీ కోల్పోయి కష్టపడి చదివి ఇ సెట్ లో మంచి ర్యాంక్ సాధించి,సి.బి.ఐ.టి లో సీటు సాధించిన రచన. తను కళాశాల,హాస్టల్ ఫీజు కట్టలేని స్థితిలో ఉన్నందువలన రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కె.టి.ఆర్ కు తన పరిస్థితిని ట్విట్టర్ ద్వారా ట్వీట్ చేయగా, స్పందించిన మంత్రి కేటీఆర్ కళాశాల,హాస్టల్ ఫీజు చెల్లించి, చదువు పూర్తిఅయ్యేంతవరకు భాధ్యత తీసుకుంటానని హామీఇచ్చితనభాధ్యత ను నెరవేర్చగా, కేటీఆర్ సహకారంతో చదివి నేడు క్యాంపస్ ఇంటర్వ్యూలో 5 మల్టీ నేషనల్ కంపనీలలో ఉద్యోగం సాధించి జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ను ఎమ్మెల్యే క్వార్టర్స్ లో మర్యాద పూర్వకంగా కలవగా, రచనను ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ శాలువాతో సత్కరించి, అభినందించారు.

## కాళికాదేవి దేవాలయంలో ఎమ్మెల్సీ డాక్టర్ పి మహేందర్రెడ్డి పూజలు



తాండూర్ ప్రజా పాలన ప్రతినిధి :తాండూరు పట్టణంలో కాళికాదేవి దేవాలయంలో బోనాల సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ పి మహేందర్రెడ్డి పాల్గొని పూజలు చేశారు .ఈ సందర్భంగా ఆలయంలో చల్లగా చూడాలని అమ్మవార్లను వేడుకున్నారు. ఆయన తెలిపారు తాండూర్ ప్రాంత ప్రజలను చల్లగా చూడాలని ఆశీర్వదించమని కోరినట్లు ఆయన తెలిపారు సందర్భంగా ఆలయ ఈవో ఎమ్మెల్సీ ని సన్మానించారు. మేము ఉంటున్న బహూకరించారు ప్రత్యేక పూజలు చేసి దర్శించుకుని కోరారు .తాండూర్ మున్సిపల్ చైర్మన్ స్వప్న . మాజీ మార్కెట్ చైర్మన్ వడ్డే శ్రీనివాస్ . జిల్లా ప్రణాళిక సంఘం సభ్యులుపట్లోళ్ల నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి పార్టీ ఆధ్వర్యంలో వీఆర్ఏ మద్దతు



మధిర జూలై రూరల్ 25 ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో సోమవారం నాడుతెలంగాణలో వి ఆర్ ఏ లకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను, వారి డిమాండ్ లను వెంటనే పరిష్కరించాలని భారతీయ జనతాపార్టీ జిల్లా కార్యదర్శి చిలివేరు సాంబశివరావు, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరవధిక దీక్ష చేపట్టిన వి ఆర్ ఏ లుకు బిజెపి సంగిభావం తెలియజేసినది. వారి డిమాండ్స్ పేస్కెలు, ప్రమోషన్స్, వారసత్వ ఉద్యోగ కేటాయింపు జరగాలని, వెంటనే అమలు చెయ్యాలని,వి ఆర్ ఏ సమస్యలు పరిస్కరించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని బిజెపి డిమాండ్ చేస్తున్నది. ఈ కార్యక్రమంలో బిజెపి మధిర రూరల్ మండలం ఇంచార్జి రామిశెట్టి నాగేశ్వరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు కుంచం కృష్ణారావు, బిజెపి నాయకులు కోనా నరసింహారావు, జివిఆర్,పట్టణ ఉపాధ్యక్షులు మాదిరాజు సాయిరామ్, మైనారిటీ మోర్చా గౌసిద్దీన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరంభారతదేశ 15వ రాష్ట్రపతిగా ఎన్నికై నేడు దేశ అత్యున్నత రాష్ట్రపతి పీఠన్ని స్వీకరించిన భారతమాత ముద్దుబిడ్డ మన గిరిజన మహిళ శ్రీమతి ద్రౌపది ముర్మ కి శుభాకాంక్షలు తెలియజేసిన భారతీయజనతాపార్టీ అర్బన్ రూరల్ కమిటీలు.దేశవ్యాప్తంగా వారి ఎన్నికతో సంబరాలు జరుపుకుంటున్న నేపథ్యంలో మధిరలో టపాసులు పేల్చి ద్రౌపతి ముర్ము గారికి శుభాకాంక్షలు తెలియజేసిన బిజెపి జిల్లా కార్యదర్శి చిలివేరు సాంబశివరావు, మండల ఇంచార్జి రామిశెట్టి నాగేశ్వరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు కుంచం కృష్ణారావు, బిజెపి నాయకులు కోనా నరసింహారావు, జివిఆర్, పట్టణ ప్రధాన కార్యదర్శి పగడాల నాగేంద్రబాబు, ఉపాధ్యక్షులు మాదిరాజు సాయిరామ్, మైనారిటీ మోర్చా గౌసిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన బాధ్యతలు తీసుకున్న ఎస్.ఐ ను మర్యాదపూర్వకంగా కలిసిన పాత్రికేయులు



కోరుట్ల, జూలై 25 (ప్రజాపాలన ప్రతినిధి):జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్.ఐ రామ్ చందర్ గౌడ్ ని మండల రిపోర్టర్లు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా తో సత్కరించారు. అనంతరం రిపోర్టర్ దర్శనలా లతీష్ మాట్లాడుతూ కథలాపూర్ మండలానికి వచ్చిన ఎస్.ఐ రామ్ చంద్రం గౌడ్ కి మా రిపోర్టర్లు తరపున ప్రత్యేక ఆహ్వానం మన మండలంలో శాంతిభద్రతలను కాపాడే విషయం లో పోలీసుశాఖకు మా పాత్రికేయుల తరపున పూర్తి మద్దతు ఉంటుదని, అలాగే ప్రజల సమస్యలను మీ దృష్టికి తీసుకు వచ్చే ప్రయత్నం మేము చేస్తామని దర్శనలా లతీష్ అన్నారు. ఈ కార్యక్రమంలో మర్రిపెల్లి నవీన్, తోగిటి సంతోష్, రాధారపు నరేష్, గుండేటి ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిఒక్కరూ ప్లాస్టిక్ ను నిర్మూలించాలి..

**జేఎస్ఎస్ జిల్లా డైరెక్టర్ రాధాకృష్ణ..**



తల్లాడ, జులై 25 (ప్రజాపాలన న్యూస్):జనశిక్షన్ సంస్థాన్ ఖమ్మం ఆధ్వర్యంలో సోమవారం బోనకల్ మండలంలోని ముష్టికుంట్ల, సీతంపేట, నాగులవంచ గ్రామాలలో స్వచత పక్వాడ కార్యక్రమాలలో భాగంగాజె యస్ యస్ సెంటర్స్ లలో ప్లాస్టిక్ నిరోధం పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జెఎస్ఎస్ జిల్లా డైరెక్టర్ వై. రాధాకృష్ణ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వలన అనేక నష్టాలు వాటిల్లి జీవనప్రమాణాలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. విధిగా అందరు ఆరోగ్యాంగా ఉండాలని, మనపరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మహిళలు, యువతీ, యువకులు పాల్గొని గ్రామంలో ప్లాస్టిక్ రహిత గ్రామంగా చేయుటలో తమవంతు సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమం లో జె యస్ యస్ లబ్ధిదారులు, స్టాఫ్,రిశోర్స్ పర్సన్స్ జాస్మిన్, యస్ కె. రజియా పాల్గొన్నారు.

## రేషనలైజేషన్ ఉత్తర్వులు వెంటనే ఉపసంహరించుకోవాలి

**రైతు నేత ఓసి సామాజిక సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు**



కరీంనగర్ జూలై 25 ప్రజాపాలన ప్రతినిధి :ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల రేషనలైజేషన్ హేతుబద్ధీకరణ చేయడానికి ప్రభుత్వం పూనుకోవడం మానుకోవాలని ఈ మేరకు విడుదలైన జీ వో నెంబర్ 25 ను తక్షణమే ఉపసంరించుకోవాలని రైతు ఉద్యమ నేత ఓసి సామాజిక సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు డిమాండ్ చేశారుసోమవారము కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయులు నిర్వహించిన నిరసన కార్యక్రమం లో నాయకుల తో కలిసి పోలాడి రామారావు హాజరై ఓసి సామాజిక సంఘాల సమాఖ్య తరపున సంఘీభావం తెలిపారుఈ సంధర్భంగా పోలాడి రామారావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల రేషనలైజేషన్ హేతుబద్ధీకరణ ఉత్తర్వుల కు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య వాదులు రాజకీయ పార్టీల నాయకులు గల మెత్తాలన్నారుఇప్పటికే 317 జీవో తో సతమవుతూ ఇప్పుడిప్పుడే టీచర్లు సర్దుకుంటున్న స్థితిలో రేషనలైజేషన్ ఉత్తర్వుల వల్ల మళ్లీ గందరగోళ పరిస్థితిలు ఏర్పడి ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందుల పాలవుతారని అన్నారురేషనలైజేషన్ ఉత్తర్వులు రద్దు చేసి ఉపాధ్యాయుల ప్రమోషన్లు పరస్పర అంగీకార బదిలీలను వెంటనే చేపట్టాలని పోలాడి రామారావు డిమాండ్ చేశారు లేకుంటే అన్ని సంఘాలను కలుపుకొని ఉదృతంగా ఉద్యమిస్తామని హెచ్చరించారుఇప్పటికే పక్క ఏపీ రాష్ట్ర సీఎం జగన్ ఉపాధ్యాయుల తీవ్ర నిరసన ఎదుర్కొంటున్నారని జగన్ లా సీఎం కేసిఆర్ ఉపాధ్యాయుల నిరసన ఎదురు కాకుండా వ్యవహరించాలని సీఎం కేసిఆర్ కు రామారావు విజ్ఞప్తి చేశారుఈ కార్యక్రమం లో జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ ఓసి సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి నాయకులు రామిడి రాజిరెడ్డి మడుపు మోహన్ అందెం ప్రభాకర్ రెడ్డి సదానందచారి తిరుపతి రెడ్డి కంకణాల జనార్ధన్ లతో పాటు పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## వీఆర్ఏల కు పేస్కేల్ జీవో వెంటనే విడుదల చెయ్యాలి: వీఆర్ఏ, జేఏసీ జిల్లా నాయకులు

**తాసిల్దార్ కార్యాలయం ముందు ప్రారంభమైన సమ్మె**



బోనకల్, జులై 25 ప్రజా పాలన ప్రతినిధి:వీఆర్ఏలకు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీల అమలుకై తలపెట్టిన నిరవధిక సమ్మె బోనకల్ మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ప్రారంభం అయినది. ఈ సందర్బంగా వీఆర్ఏ, జేఏసీ జిల్లా ఉపాధ్యక్షులు మరీదు వెంకట్, జిల్లా కార్యదర్శి పులుసు వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షులు సుధాకర్, కార్యదర్శి కిరణ్ లు మాట్లాడుతూ పే స్కేల్ జీవో అమలు చేసే వరకు నిరవదిక సమ్మె కొనసాగుతుందని, 55 సంవత్సరాలు నిండిన వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని, అర్హత కలిగిన ప్రతి వీఆర్ఏకు ప్రమోషన్లు ఇవ్వాలని ఈ సందర్బంగా తెలియచేసారు. ఈ కార్యక్రమంలో మండలంలో వివిధ గ్రామాలకి చెందిన వీఆర్ఏలు పాల్గొన్నారు.

## అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదు



మంచిర్యాల టౌన్, జూలై 24, ప్రజాపాలన : అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని, సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగి , నిరుపేదలకు సహాయం చేస్తూ నిరంతరం ప్రజల్లో మమేకమవుతున్న మాజీ ఎమ్మెల్సీ, ఏఐసీసీ సభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు పై ఎమ్మెల్యే తనయుడు నడిపెల్లి విజిత్ రావు అవాకులు చెవాకులు పేలితే సహించేది లేదని కాంగ్రెస్ నేతలు హెచ్చరించారు. ఆదివారం ప్రేమ సాగర రావు నివాస గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పీసీసీ మాజీ అధికార ప్రతినిధి చిట్ల సత్యనారాయణ , నస్పూర్ మున్సిపల్ పట్టణ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు బండారు సుధాకర్ టీఆర్ఎస్ నేతల విమర్శలను ఖండించారు. నడిపెల్లి విజిత్ రావు, ప్రేమ్ సాగర్ రావును విమర్శించే స్థాయి, హెూదా రెండు లేవని అన్నారు. ఎన్నికల్లో ఓటైపాలైనప్పటికీ నిరంతరం ప్రజలకు సేవ చేయాలనే తపనతో ప్రజల మధ్య తిరుగుతున్న ప్రేమ్ సాగర్ రావును చూసి ఓర్వలేక టిఆర్ఎస్ నేతలు అసత్య ఆరోపణలు చేస్తున్నారని వారు ధ్వజమెత్తారు.కరోనా సమయంలో ప్రేమ్ సాగర్ రావు ఎంత సేవ చేసాడో ప్రజలకు తెలుసని అన్నారు. అసత్య ఆరోపణలు మాట్లాడితే తగిన రీతిలో బుద్ధి చెప్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పుదరి తిరుపతి, మంచిర్యాల పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్, నస్పూర్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుర్మిళ్ళ వేణు, మంచిర్యాల డిప్యూటి ఫ్లోర్ లీడర్లు వేములపల్లి సంజీవ్, మాజిద్,మహిళ జిల్లా అధ్యక్షురాలు పెంట రజిత,యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సంపత్ రెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు కౌన్సిలర్ సల్ల మహేష్, పట్టణ అధ్యక్షుడు షేర్ పవన్, ఓబీసీ సెల్ జిల్లా చైర్మెన్ వడ్డే రాజమౌళి,లలిత,తదితరులు పాల్గొన్నారు.

## డెమొక్రటిక్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా కమిటీ ఎన్నిక



మంచిర్యాల టౌన్, జూలై 25, ప్రజాపాలన: మంచిర్యాల జిల్లా కేంద్రంలోనీ వివేక వర్ధిని డిగ్రీ కళాశాలలో డెమొక్రటిక్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం జిల్లా కమిటీ ఎన్నికలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎన్నికల అధికారులుగా రాష్ట్ర అధ్యక్షులు ఏనుగు మల్లారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి నారమల్ల విజయ్ కుమార్ హాజరై ఎన్నికలను నిర్వహించారు. మంచిర్యాల జిల్లా డి.జి.ఎఫ్. అధ్యక్షునిగా తీగల శ్రీనివాస్ రావు, ప్రధాన కార్యదర్శిగా కొండ ప్రవీణ్ కుమార్. జిల్లా కోశాధికారిగా చిడిపి ప్రవీణ్ ఆనంద్ కుమార్. ఉపాధ్యక్షులుగా పులి రాజారాం, జిల్లా కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు ఏనుగు మల్లారెడ్డి మాట్లాడుతూ జర్నలిస్ట్ ల హెూక్కులకోసం పోరాడలన్నారు, రాష్ట్ర కార్యదర్శి విజయ్ కుమార్ మాట్లాడుతూ జర్నలిస్టలకు ఏ సమస్య వచ్చిన డి జె ఫ్ ముందుంటుందన్నారు. నూతన కమిటీకి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు శ్రీనివాస్ గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేను సైతం అంటూ బోనం సమర్పించిన చిన్నారి



హైదరాబాద్, ప్రజాపాలన ప్రతినిధి: నగరంలో ఘనంగా జరుగుతున్న బోనాల ఉత్సవాలలో చిన్న, పెద్ద, ఆడ, మగ తేడా లేకుండా అందరూ అత్యంత ఉత్సాహంగా పాల్గొని అమ్మవారికి బోనాలు అత్యంత భక్తి శ్రద్ధలతో సమర్పించుకుంటున్నారు. ఈ క్రమంలో ఆదివారం బేగంపేట బంగారు మైసమ్మ ఆలయానికి చిన్నారి అరవల్లి రిష్వీ తలపై బోనంతో వచ్చిన దృశ్యం అందరినీ ఆకట్టుకుంది. మరి బోనం సమర్పించిన తరువాత అమ్మవారికి ఏం కోరిక కోరిందో కదా ఈ చిన్నారి అని అక్కడ చేరిన భక్తులు సరదాగా అనుకున్నారు.

# సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి: వికారాబాద్ జిల్లా కలెక్టర్ నిఖిల

వికారాబాద్ బ్యూరో 25 జూలై ప్రజా పాలన : జిల్లాలో డెంగ్యూ , మలేరియా, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో డెంగ్యూ మలేరియా సీజనల్ వ్యాధులు, రెసిడెన్షియల్ పాఠశాలలో హాస్టల్లో ఆహార భద్రత , కోవిడ్ టీకా మరియు బూస్టర్ డోస్ వేసేందుకు తగు చర్లపై మండల ప్రత్యేక అధికారులు, మునిసిపల్ కమిషనర్లు ఎంపీడీవోలు, ఎంపీఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం ప్రజల ఆరోగ్య పట్ల ప్రత్యేకమైన దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని దీనికి సంబంధించి ఇంటింటి సర్వే నిర్వహించి జ్వరాల బారిన పడిన వ్యక్తులను గుర్తించి వైద్య సేవలు అందించాలని కలెక్టర్ తెలిపారు. గ్రామాల్లో ఆరోగ్య మరియు పారిశుద్ధ్య కమిటీ ఏర్పాటు చేసి ప్రజలకు సీజనల్ వ్యాధుల పట్ల పారిశుద్ధంపై అవగాహన కల్పించేందుకు పూనుకోవాలని కలెక్టర్ సూచించారు గ్రామస్థాయిలో సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి , ఏఎన్ఎం, ఆశా, అంగన్వాడి వర్కర్లు, వార్డు సభ్యులతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులతో కలిపి గ్రామ కమిటీలను ఏర్పాటు చేసి సమన్వయంతో పని చేయాలన్నారు. అదేవిధంగా మండల స్థాయిలో ప్రత్యేక అధికారి, ఎంపీడీవో ఎంపీవో , ఏపీవో, సూపరిండెంట్ స్థాయి అధికారులతో కలిపి కమిటీలను ఏర్పాటు చేసత్రా ఉత్తర్వులు ఇవ్వాలని కలెక్టర్ సంబంధించి అధికారులకు ఆదేశించారు. గ్రామ మండల స్థాయిలలో ఏర్పాటుచేసిన ఆరోగ్యం మరియు పారిశుద్ధ కమిటీలు మంగళవారం( రేపు) నుండి ఉదయం ఎనిమిది గంటల నుండి గ్రామాలను సందర్శించి వచ్చే పట్టేసిన పనులను ఐదు రోజుల్లో పూర్తి కావాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామాల్లో కమిటీ సభ్యులు ప్రతి ఇంటిని సందర్శించి ప్రజల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటూ పారిశుద్ధ్య పనులు, పైపు లైన్ల లీకేజీలు , ఉపరితల ట్యాంకుల వద్ద నీరు నిలవకుండా ఉండకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ట్యాంకులను ప్రతినెల మూడు రోజులు శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలి అన్నారు. గ్రామపంచాయతీలలోని మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసేలా, ఆయిల్ బాల్స్ , మోతాదు మేరకు బ్లీచింగ్ పౌడర్ వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లపైన గుంతల్లో నీరు నిలవకుండా మట్టితో పూచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే గా పాటిస్తూనే ఆదివారం ప్రతి ఇంటిని, పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. గ్రామాల్లో ఇంటింటి సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది కోవిడ్ వ్యాక్సినేషన్ 100 శాతం పూర్తయ్యేలా చూడాలన్నారు. అదేవిధంగా ప్రజల ఆరోగ్యం అవగాహన కల్పిస్తూ ప్రస్తుత సమయంలో కాచి మరగబెట్టిన నీరును త్రాగాలని సూచించాలన్నారు. గ్రామ



పంచాయితీలు గ్రీన్ బడ్జెట్ లో నాటే ప్రక్రియతో పాటు గ్రామాల్లో శానిటేషన్ అప్పటిను చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీ పరిధిలో మున్సిపాలిటీ పరిధిలో కూడా ఆరోగ్య మరియు పారిశుధ్య కమిటీలను ఏర్పాటు చేసి ప్రతి వార్డులో పారిశుధ్య పనులు చేపడుతూ.. చెత్తాచెదారం లేకుండా పిచ్చి మొక్కలను తొలగించాలని కమిషనర్ సూచించారు. శానిటేషన్ పనులు చేపడుతూనే వ్యాక్సినేషన్ చేసిన ప్రక్రియను కూడా పూర్తి చేయాలన్నారు. ప్రత్యేక అధికారులు కమిటీ సభ్యులతో కలిసి సమస్యల పరిష్కారాన్ని కృషి చేయాలని అన్నారు..సమీక్ష సమావేశంలో జడ్పీ సీఈవో జానకి రెడ్డి, ఇన్చార్జి డిఆర్ఓ విజయకుమారి, డిఎంహెచ్వో తుకారం, డిపిఓ మల్లారెడ్డి , గిరిజన అభివృద్ధి అధికారి కోటాజి, షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి మల్లేశం, బీసీ అభివృద్ధి అధికారి ఉపేందర్ , ఎంపీడీవోలు మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# రైతు బందు పేరుతో కెసిఆర్ నాటకాలు: సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు

**అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని డిమాండ్**



బోనకల్, జులై 25 ప్రజా పాలన ప్రతినిధి: గత కొన్ని రోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో అకాల వర్షాల కారణంగా నష్టపోయిన గుడిదే నాగేశ్వరరావు, మందడుపు రాకేష్ , ధమాల బాబు తదితర రైతుల పొలాలను సిపిఐ నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆర్భాటంగా ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి కిసాన్ యోజన పథకం ఏమైందని ఆయన ప్రశ్నించారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కేవలం కార్పొరేట్ సంస్థలను బాగుపరచడానికే కానీ రైతులకు ఉపయోగపడేది కాదని విమర్శించారు. లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేస్తున్న అవేమీ పేద ప్రజలకు అందడం లేదని, మోడీ నాయకత్వంలో పనిచేస్తున్న కేంద్ర ప్రభుత్వం రైతుల గురించి అసలు పట్టించుకోవడం లేదన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలోనే రైతుబంధు ఇస్తున్నామని గొప్పలు చెప్పుకునే కేసీఆర్ కేవలం రైతుబంధును కంటి తుడుపు చర్యగా మార్చాడని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో రైతులకు సబ్సిడీలో 24 రకాల పరికరాలు ఇచ్చేవారని, అతివృత్తి అనావృష్టిలకు గురై పంటలు నష్టపోయిన వారికి నష్టపరిహారం చెల్లించేవారని, అవేమీ లేకుండా కేవలం రైతుబంధుతో కెసిఆర్ నాటకాలు ఆడుతున్నారని ఆయన విమర్శించారు. పంట నష్టపోయిన రైతుల పొలాల వివరాలు, రైతుల వివరాలు వెంటనే తెలుసుకుని, నష్టాన్ని అంచనా వేసి మొక్క దశలో నష్టపోయారు కనుక ఎకరానికి 20000 చొప్పున నష్టపరిహారాన్ని అందించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాన్నీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి గుడిదే కృష్ణ, సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు వంగాల నరసింహ, కొంగర కృష్ణయ్య, నాయకులు రావుల వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

# వీఆర్ఏ ల సమ్మెకు మద్దతు తెలిపిన కాంగ్రెస్ పార్టీ



మధిర జూలై 25 ప్రజా పాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో సోమవారం నాడు మధిర మండల తహసిల్దార్ కార్యాలయం ముందు తమ హక్కుల సాధన కోసం వీఆర్ఏలు చేపడుతున్న నిరవధిక సమ్మెకు మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ లిఅధ్యక్షుడు మిరియాల వెంకటరమణ గుప్తాలి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మద్దతు ప్రకటించడం జరిగింది. ఈ సందర్భంగా లిమిర్యాల వెంకటరమణ గుప్తాలి మాట్లాడుతూ కేసీఆర్ బూటకపు మాటలు చెప్పి అధికారంలోకి వచ్చాక వీఆర్ఏలను మోసం చేసిండు అనినోటికి వచ్చిన హామీలు అన్ని చెప్పి వాటిని అమలు చేయడం లో టీర్ యెస్ ప్రభుత్వం విఫలమైందని అన్నారు వారి సమస్యలు పట్టించుకోకుండా వదిలేసిందని వారి ప్రధాన డిమాండ్లు అయినా లిపే స్కేల్ జీవోను వెంటనే విడుదల చేయాలనిఅర్హత గల వీఆర్ఏలకు ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని55 సంవత్సరాల పైబడిన వీఆర్ఏల స్థానంలో వారసులకు ఉద్యోగం ఇవ్వాలనిలి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మధిర శాసనసభ్యులు లిమల్లు భట్టి విక్రమార్క దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి వీఆర్ఏల డిమాండ్లను అసెంబ్లీలో ప్రస్తావించేలా చూస్తామని వీఆర్ఏలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కౌన్సిలర్ లిమునుగోటి వెంకటేశ్వరరావులి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు లిఅద్దంకి రవికుమార్లి పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు లిషేక్ జహంగీర్లి కాంగ్రెస్ నాయకులు లిఆదిమూలం శ్రీనివాసరావు, పుట్ట పుల్లారావు, కోట నాగరాజు, బోల్లెద్దు రాజేంద్రప్రసాద్, బండారి నరసింహారావులి మొదలగువారు పాల్గొన్నారు


ప్రజాపాలన

జాతీయ తెలుగు దినపత్రిక తెలుగురాష్ట్రాల్లో విస్తృత పర్చేందుకు మా బిజినెస్ అసోసియేట్స్‌ను మీకు పరిచయం చేస్తున్నాం. దిగువ ఇవ్వబడిన బిజినెస్ అసోసియేట్స్ 'ప్రజాపాలన' జాతీయ తెలుగు దినపత్రికలో వార్తా సంబంధ విషయాల్లో,ప్రకటనలు స్వీకరించేందుకు,ప్రజాపాలన దిన పత్రిక చందా విషయమై ఎప్పుడూ మీకు అందుబాటులో ఉంటారు.

బిజినెస్ అసోసియేట్స్-టెలిఫోన్ నెంబర్లు

| | | | | |
|---|---|---|---|---|
| కడమంచి నారాయణ దాస్ | - | చేవెళ్ల | - | 9849526878 |
| నరోత్తమ్‌రెడ్డి | - | మేడిపల్లి | - | 9346970159 |
| వెంకటస్వామి | - | మంచిర్యాల | - | 9515048103 |
| ఎం. గైబులు | - | వికారాబాద్ | - | 9704570475 |
| టి.రాంబాబు | - | శేర్లింగంపల్లి | - | 6301925113 |
| సత్య కిషోర్ | - | అమీర్‌పేట | - | 6309723472 |
| బోడ మనోహర్ నంద | - | కరీంనగర్ | - | 9492927684 |
| రాజేందర్ ప్రసాద్ | - | ఖమ్మం | - | 7013953536 |
| పి.ఎన్.శ్రీనివాస్ | - | మధిర | - | 9030821362 |
| గంజిగుంట్ల వెంకన్న | - | పాలేరు | - | 9848895405 |
| ఆర్.రాజేశ్వర్ రావు | - | మయూర్ సెంటర్ | - | 9160400339 |
| మాలేడు నరేందర్ | - | ఖమ్మం రూరల్ | - | 8074550397 |
| టిఎస్.చక్రవర్తి | - | ఖమ్మం టౌన్ | - | 9948327333 |
| పసుపులేటి ఈశ్వర్‌తేజ | - | మధిర రూరల్ | - | 6305269141 |
| ఆర్.శ్రీనివాస్ | - | ఎర్రుపాలెం మండలం | - | 8501020885 |
| బుక్య.శ్రీను | - | బోనకల్ | - | 8688810293 |
| సి.మల్లేష్ | - | ఇబ్రహీపట్నం | - | 9618028334 |
| దుంపాల రాజేష్ | - | మేడ్చల్ | - | 9000178307 |
| వై.నర్సింహులు | - | తాండూరు | - | 7207677049 |
| డి.ప్రవీణ్ కుమార్ | - | కొడంగల్ | - | 9866027635 |
| టి.సురేష్ చారీ | - | ఆసిఫాబాద్ | - | 9000983108 |
| డి.భాస్కర్ | - | బెల్లంపల్లి | - | 9440018863 |
| ఐ.నర్సింహయ్య | - | జన్నారం రూరల్ | - | 9493314399 |
| గొట్టె సురేందర్ | - | మంచిర్యాల టౌన్ | - | 9248528680 |
| గొడ్లబాబూరావు | - | తల్లాడ | - | 9848236015 |


# ఆషాడ మాస గోరింటాకు ఉత్సవాల్లో పాల్గొన్న జడ్పీ చైర్పర్సన్ దావ వసంత



జగిత్యాల, జూలై 25 (ప్రజాపాలన ప్రతినిధి): పిఆర్ టియూ టిఎస్ జగిత్యాల జిల్లా శాఖ వారి ఆధ్వర్యంలో ఓల్డ్ హై స్కూల్లో ఆషాడ మాస గోరింటాకు ఉత్సవాల్లో జిల్లా జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్బంగా జెడ్పీ చైర్ పర్సన్ మాట్లాడుతూ ప్రతీ శుభ కార్యాల్లో గోరింటాకు ప్రత్యేకత ఉంటుందని అన్నారు. శరీరంలోని వేడిని గ్రహించి చల్లదనాన్ని ఇనస్తుంది, అంతేకాకుండా చర్మవ్యాధులు సంబంధించిన రోగాలు రాకుండా కాపాడుతుందని అన్నారు. వయస్సు తో సంబంధం లేకుండా మహిళలందరూ గోరింటాకును ఇష్టపడతారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ గాయిత్రి, జానకి, జమున, అనిత,వసంత, చెందన, విద్యా, రాధ, నాగ రాణి, సరోజ, శ్రీదేవి, జయ శ్రీ, రచన తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్రం లో కుల వృత్తుల అభివృధికి ముఖ్యమంత్రి కేసిఆర్ కృషి

**ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్**



జగిత్యాల, జులై 25 (ప్రజాపాలన ప్రతినిధి): పట్టణ 10వ వార్డు ఎలుక భావి వాడ గంగపుత్ర సంఘ భవన నిర్మాణానికి 5 లక్షల ప్రొసీడింగ్ కాపీని గంగపుత్ర సంఘ సభ్యులకు ఎమ్మెల్యే క్వార్టర్ లో ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ అందజేసినారు. అనంతరం మాట్లాడుతూ గంగ పుత్రుల అభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కట్టు బడి ఉందని, అన్ని కుల వృత్తుల అభివృద్ధికి ముఖ్యమంత్రి కేసిఆర్ కృషి చేస్తున్నారని అన్నారు. రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత మిషన్ కాకతీయ లోభాగంగా చెరువు పూడిక తీసి, కట్టలు సరిచేసామని, కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా రాష్ట్రం లో అన్ని చెరువులు జల కళ ను సంతరించుకున్నాయి అని, చెరువుల్లో ఉచిత చేప పిల్లలు పంపిణీ చేశామని, రాష్ట్రం లో మత్స్య సంపద పెంచామని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లు సిరికొండ భారతి రాజయ్య, అరుముళ్ల నర్సమ్మ, రాజ్ కుమార్, ఎఫ్ సిఎస్ అధ్యక్షులు గుమ్ముల అంజయ్య, డైరెక్టర్ ఆరుముల్ల పవన్, ఎంపీటీసీ భూపెల్లి శ్రీనివాస్, నాయకులు జంభర్తీ రమేష్, నాచుపల్లి రెడ్డి, నారాయణ, కిరణ్, నరేందర్, నర్సయ్య, గంగారజం, రాజం, సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# మన్నెగూడేంను నూతన మండలంగా ప్రకటించాలి




కోరుట్ల, జూలై 25 (ప్రజాపాలన ప్రతినిధి):జగిత్యాల జిల్లాలోని కోరుట్ల డివిజన్ పరిధిలో ఉన్న మన్నెగూడెంను నూతన మండలంగా ప్రకటించాలని కోరుతూ మన్నేగుడెం గ్రామానికి చెందిన ప్రజలు, జగిత్యాల జిల్లా సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు, స్థానిక గ్రామ సర్పంచ్ నరేష్ రెడ్డి, ఎంపిటీసి చెన్నమనేని రవీందర్ రావు ల ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో జిల్లా కలెక్టరేట్ కు తరలివచ్చారు. రెండు రోజుల క్రితం మేడిపల్లి మండలంలో ఉన్న భీమారంను కొత్తగా మండలంగా ప్రకటించిన, నేపథ్యంలో మన్నెగూడెంను కూడా మండలంగా ప్రకటించాలని జగిత్యాల జిల్లా కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని మన్నేగుడేం గ్రామస్తులు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జగిత్యాల జిల్లా కలెక్టరేట్ వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ ఆందోళనలో గ్రామ పెద్దలు,యువత ఉన్నారు.

# కామ్రేడ్ మండవ కృష్ణారావు ప్రధమ వర్ధంతి



మధిర రూరల్ జూలై 25 ప్రజా పాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో సోమవారం నాడు18 వ వార్డు లడకబజార్లో సోమవారం సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కామ్రేడ్. మండవ. కృష్ణారావు ప్రథమ వర్ధంతి నిర్వహించారు. ఈ వర్ధంతిలో పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి.సరళ , మాజీ చైర్ పర్సన్ అఫ్రోజ్. సమీనా , ఐద్వా ఖమ్మం జిల్లా అధ్యక్షురాలు. బండి.పద్మ , ఐద్వా వైరా ఇంచార్జీ మేరుగు.రమణ , ఐద్వా వైరా పట్టణ కార్యదర్శి గుడిమెట్ల రజిత, ఐద్వా మధిర అధ్యక్షురాలు షేక్.ఫాతిమా, మరియు కుటుంబ సభ్యులు, సిపిఎం పార్టీ పట్టణ, మండల కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# నేను పుట్టి పెరిగిన ప్రపంచం..

## ఎలుగందులలో దినచర్య



**బిఎస్. రాములు**
**సామాజిక వేత్త**
**బిసి కమీషన్ మాజీ ఛైర్మన్**

***ఇంటికి కూరగాయలు:***

నేను ఇంటికోసం కూడా కూరగాయలు తీసుకున్నాను. దస్తీలో కట్టి..."లక్ష్మీపతి! ఇవి ఇంటికాడ అమ్మకు ఇచ్చేయ్!". అని లక్ష్మీపతికి ఇచ్చేసి నేను తిరిగి హాస్టల్ వైపు నడిచాను. హాస్టల్‌కు ఏ యే కూరగాయలు తీసుకున్నానో, ఆ కూరగాయలు కాకుండా వేరే కూరగాయలు తీసుకోవడం మంచిది అని తెలిసివచ్చింది. హాస్టల్లో ఏ కూరగాయ వండితే సారు ఇంట్లో ఆ కూరగాయనే వండితే హాస్టల్ విద్యార్థులకు కొన్న కూరగాయలనే సార్ కొన్ని పట్టుకుపోయాడని అనుకుంటారు. అని మల్లయ్య కుక్ ఒకసారి చెప్పాడు. అప్పటినుండి నాకు వేరే కూరగాయలు. హాస్టల్‌కు వేరే కూరగాయలు తీసుకుంటాను. హాస్టల్‌లో సిబ్బంది వంట చేస్తుంటే కాసేపు హాస్టల్ బీరువాలోని పుస్తకాలు తీసుకొని చదువుకుంటూ కూర్చున్నాను.

***హాస్టల్ భోజనం:***

హాస్టల్లో ప్రతిరోజు ఉదయం చారు, అన్నం, మధ్యాహ్నం పప్పుచారు, అన్నం, సాయంత్రం ఆరున్నర, ఏడింటికి కూరగాయలు, చారు, అన్నం ఉంటుంది. వారానికి ఒకసారి మాంసం, ఒకసారి కోడిగుడ్డు పెడుతుంటాము. ఎలుగందులలో వారానికి ఒకసారి మాత్రమే మేకను కోస్తుంటారు. మాంసమైనా, కిరాణా సామానైనా ఉద్దెర తీసుకోవడమే. కరీముద్దీన్ హెూల్‌సేల్ షాపులో ఖాతా ఉంటుంది. ఆయనదగ్గర లేనివి ఆయన తెప్పించి ఇస్తాడు. కూరగాయలకు నగదు పెట్టి కొనాలి. అప్పుడప్పుడు జేబులో పైసలు లేకపోతే కూరగాయలకు కరీముద్దీన్‌నే అడిగి తీసుకొని ఇచ్చేస్తుంటాను. ప్రతి బుధవారం కూరగాయలతోపాటు బియ్యం, పప్పులు, ఉప్పులు, పసుపు, మిర్చి అమ్మే అంగడి సాగుతుంటుంది. నెయ్యితో సహా పెరుగు, చింతపండు, పసుపుకొమ్ములు, మిరపకాయలు, ఆవాలు, ఎల్లిగడ్డలు, ఉల్లిగడ్డలు మొదలైనవి కూడా అంగట్లో అమ్ముతుంటారు.

హాస్టల్లో మధ్యాహ్నం కోసం వంట పూర్తయ్యాక...

"ఇక ఇంటికి పోదామా సార్!" అంటూ కుక్ మల్లయ్య ఆ పూట పని అయిపోయినట్టు వచ్చి నిలబడ్డాడు. సరేనని ఆఫీసు రూమునుండి బయటకు వచ్చాను. ఆఫీసు కం స్టోర్ రూమ్‌కు తాళం వేసి తాళం చెవి చేతికి ఇచ్చాడు కుక్ మల్లయ్య. అందరం కలిసి పెద్ద దర్వాజా దాటి బయటకు నడిచాము. కుక్ మల్లయ్య కామాటి దేవేంద్ర నా వెంట ఇంటిదాకా వచ్చారు.

శ్యామలను "నమస్తే అమ్మా!" అంటూ పలకరించారు.

"టిఫిన్ చేసిన. కొంచెం అంత తినుండ్రి" అంటూ శ్యామల అడిగింది.

"వద్దమ్మా! హాస్టల్లోనే తిన్నం!" అంటూ వారించారు.

"చాయ్ తాగుదురు ఉండండి" అంటూ లోపలికి పిలిచింది శ్యామల.

నాకు టిపిన్ ఇచ్చి వారికి చాయ్ పెట్టింది.

ఇంకా రెండేళ్లు నిండని పాణిగ్రాహిని వారు దగ్గరకు తీసుకొని ఎత్తుకొని ముద్దాడారు.

***కొత్త సంస్కృతి, అలవాట్లు***

శ్యామల ఆరోజు ఉప్మా చేసింది. పాణికి స్నానం కూడా చేయించి నట్టుంది.

మా పక్క గదిలో ఉండే ఐత్‌పల్లి టీచరమ్మ "నమస్కారం సార్!" అంటూ పలకరించింది.

పద్మనాభం సార్ కొడుకు లచ్చన్న (తుమ్మేరు లక్ష్మణరావు రిటైర్డ్ ప్రిన్సిపాల్), లచ్చన్న తమ్ముడు భాస్కర్ నమస్కారం సార్ అంటూ పలకరించారు. వాళ్లను విడిపించుకొని పరుగున వచ్చి కాలుకు చుట్టుకున్నాడు పాణి. వాడ్ని తీసుకొని ఎత్తుకున్నాను. వరండాలో మంచం మీద కూర్చున్నాను. శ్యామల ప్లేట్లో ఉప్మా తెచ్చింది. పాణిని కూడా తినమని ఉపూ ఉపూ అంటు ఊదుతూ నోట్లో పెట్టబోయాను. ఊహూం అంటూ చంక దిగి పరిగెత్తాడు. వాళ్లు చాయ్ తాగి మంచిది వస్తం సార్! అంటూ బయలుదేరారు.

మాకు ఎలుగందులకు వచ్చిన తర్వాత టిఫిన్‌లు చేయడం, టిఫిన్‌లు తినడం కొత్తగా అలవాటయింది. పొద్దున్నే టిఫిన్‌లు చేసి చాయ్ తాగడం అనేది కొత్తగా అలవాటు చేసుకున్నాము. తుమ్మేరు పద్మనాభం సారు మా పక్క గదిలోనే కిరాయికి ఉంటాడు. పెద్ద కుటుంబం. వాళ్ళంతా పొద్దున టిఫిన్‌లు చేస్తుంటారు. నేను జగిత్యాలలో ఉన్నప్పుడు గానీ, ధర్మపురిలో ఉన్నప్పుడు గానీ, మూడు పూటలు, లేదా రెండు పూటలు భోజనమే తప్ప ప్రత్యేకంగా ఇంట్లో టిఫిన్‌లు చేసుడు అనేది అలవాటు లేదు.

**(మిగతాభాగం రేపటి సంచికలో..)**

# టిఆర్ఎస్ పార్టీ హయాంలోనే మధిర శరవేగంగా అభివృద్ధి: లింగాల కమల్ రాజు



మధిర జులై 25 ప్రజా పాలన ప్రతినిధిమున్సిపాలిటీ పరిధిలో సోమవారం నాడు వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్ కు భూమి పూజ చేసిన మధిర మున్సిపల్ చైర్మన్ మొండితోక లత ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు మధిర మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా నిర్మించబోతున్న వెజ్ నాన్ వెజ్ మార్కెట్ కు మున్సిపల్ చైర్మన్ మొండితోక లతా భూమి పూజ చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు హాజరైనారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో పోరాడిన తెలంగాణ కష్టాలు తెలిసిన వ్యక్తి ముఖ్యమంత్రిగా ఉ ండడం వలన దేశంలోనే అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రం శరవేగంగా దూసుకుపోతోంది దానిలో భాగంగా గతంలో ఎన్నడూ జరిగనటువంటి మధిర నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగింది మధిర అంబర్పేట చెరువు ట్యాంక్ బండ్ నిర్మాణం పనులు, అంబేద్కర్ సెంటర్ సుందరీకరణ, సెంటర్ లైటింగ్ డివైడర్,పబ్లిక్ టాయిలెట్స్ లాంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేసుకోవడం జరిగింది దానిలో భాగంగా ఈరోజు వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్ కు భూమి పూజ చేసుకోవడం వ్యాపారులు మరియు మధిర ప్రజలు ఆనందించదగిన విషయమని అతి త్వరలోనే పూర్తి చేసి మున్సిపాలిటీ ప్రజలకు సౌకర్యంగా ఉండే విధంగా ఏర్పాటు చేస్తామని ఇటువంటి గొప్ప కార్యక్రమాలు చేస్తున్నటువంటి రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు కి, ఐటి మరియు పురపాలక శాఖ కల్వకుంట్ల తారక రామారావు కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మదిర మున్సిపాలిటీ కమిషనర్, మున్సిపల్ కౌన్సిలర్స్, సొసైటీ అధ్యక్షులు బిక్క ప్రసాద్ గాంధీ రజిని మాధవి లక్ష్మి ఆత్మ కమిటీ చైర్మన్ కోటేశ్వరావు కపిల్వాయి జగన్ మోహన్ రావు మున్సిపల్ సిబ్బంది కమిషనర్ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు కార్యకర్తలు హాజరైనారు.

# విఆర్ ఏ ల సమస్యలు పరిష్కరించాలి

**వైయస్సార్ తెలంగాణ పార్టీ రాష్ట్ర నాయకుడు మాదగోని జంగయ్య గౌడ్**



ఇబ్రహీంపట్నం జూలై తేదీ 25 ప్రజాపాలన ప్రతినిధి :మంచాల మండలం కేంద్రంలో వైయస్సార్ తెలంగాణ పార్టీ రాష్ట్ర నాయకుడు మాదగోని జంగయ్యగౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో మొదలు పెట్టిన భూ రికార్డ్ సర్వేకార్యక్రమలో ఎంతో కీలక పాత్ర పోషించిన గ్రామ వి ఆర్ ఏ ల పరిస్థితి చాలా ఘోరంగా మారింది అన్నారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వి ఆర్వో వ్యవస్థను రద్దు చేయటంతో గ్రామాల్లో ఉన్న రెవెన్యూ వి ఆర్ ఏ లు తహశీల్దార్ కార్యాలయంలో ఏమి పని చేయాలో అర్థం కాక ఆందోళనలు చెందుతున్నారు అన్నారు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ పలు సందర్భాల్లో మాట్లాడుతూ వి ఆర్వో వ్యవస్థ రద్దు కావటంతో ఖాళీగా ఉన్న వి ఆర్వో వి ఆర్ ఏ లకు మరో చోట ఉద్యోగ అవకాశం కలిపిస్తాం వారి కుటుంబాలను అన్నివిధాలుగా ఆదుకుంటాం అని అసెంబ్లీ సాక్షిగా గొప్పలు చెప్పిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ వి ఆర్వో వ్యవస్థను రద్దు చేసి రెండు ఏండ్లు దాటినా ఇప్పట్టి వరకు ఏ ఒక్క వి ఆర్ ఏ కు మరో చోట ఉద్యోగ అవకాశం కల్పించలేదు అన్నారు గ్రామ వి ఆర్వో ల పరిస్థితి కూడా దయనీయ పరిస్థితుల్లో ఉన్నారు వి ఆర్వో లకు మరో ఉద్యోగ అవకాశం కల్పించి ఆదుకోవాలి అన్నారు గ్రామ లోరైతుల భూ సమస్యలు పరిష్కరించటంలో కీలక పాత్ర పోషించిన వి ఆర్ ఏ లు తమ న్యాయమైన డిమాండ్ల కోసం ఆర్డీఓ కార్యాలయ ముందు దీక్షలు చేస్తూ పోరాటం చేస్తున్న ప్రభుత్వనికి చీమ కుట్టి నట్టు కూడా లేదు అన్నారు వెంటనే ప్రభుత్వం స్పందించి వి అర్ ఏ ల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టాలి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలి వి ఆర్ ఏ లు అన్ని విధాలుగా ఆదుకోవాలి అలాగే వి ఆర్వో ల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వని డిమాండ్ చేస్తున్నాంలేని పక్షంలో వి ఆర్ ఏ లతో కలిసి ఉద్యమం వేగవంతం చేస్తాం అని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వని హెచ్చరిస్తున్నాం ఈ కార్యక్రమంలో.మంచాల మండలం అధ్యక్షుడునేనవత్ శ్రీనివాస్ నాయక్.యాచారం మండలం అధ్యక్షుడు పంది జయరాజ్.బూడిద మహేందర్ఉదవత్ బాలాజీ నాయక్, ఉదవత్ కిసాన్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతంలో అకౌంట్ దారులకు అవగాహన కల్పించిన ప్రతి ఒక్కరు ఇన్సూరెన్స్ చేయించుకునలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు బృందం



ఇబ్రహీంపట్నం జూలై తేదీ 25 ప్రజాపాలన ప్రతినిధి :రంగారెడ్డి జిల్లా యాచారం మండల పరిధిలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ యాచారం శాఖ వారి ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు, మొండిగౌరెల్లి పంచాయతీ దగ్గర, ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమం జరిగింది,12 రూపాయల ఇన్సూరెన్స్,, 325 రూపాయలు ఇన్సూరెన్స్. గురించి, మరియు జిరో అకౌంట్ ల గురించి , చర్చించడం జరిగింది బ్యాంకులో ఉన్నటువంటి అనేక స్కీములు ప్రజలందరూ వినియోగించుకోవాలని గ్రామ సర్పంచ్ బండిమీది కృష్ణ మాదిగ అన్నారు, ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దీపిక , కల్యాణ్, సంఘం అధ్యక్షురాలు ,బిసు కోమార్ యార బుచ్చమ్మ,, ఐకెపి సిబ్బంది, కట్టెల జంగయ్య,డేరంగుల, విజయలక్ష్మి, మహిళా సంఘం సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## ప్లాస్టిక్ రహిత సమాజస్థాపనే మన లక్ష్యం: జె యస్ యస్ జిల్లా డైరెక్టర్ వై రాధాకృష్ణ.



బోనకల్, జులై 25 ప్రజాపాలన ప్రతినిధి: జనశిక్షన్ సంస్థాన్ ఖమ్మం జిల్లా వారి ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని ముష్టికుంట్ల గ్రామాలలో స్వచత పక్వాడ కార్యక్రమాలలో భాగంగా జె యస్ యస్ సెంటర్స్ లలో ప్లాస్టిక్ నిరోధం పై అవగాహన సదస్సును నిర్వహించి లబ్ధిదారులతో పేపర్ కవర్స్ తయారు చేయించడం జరిగింది. ప్రజలందరు విధిగా పేపర్ , క్లాత్స్, జనప నారతో తయారు చేయబడిన సంచులను మాత్రమే వాడాలని సూచించారు. ప్లాస్టిక్ వాడకం వలన అనేక నష్టాలు వాటిల్లి జీవన ప్రమాణాలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉన్నదని, అందరు ఆరోగ్యాంగా ఉండాలని, మనపరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని,జె యస్ యస్ డైరెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమం లో మహిళలు, యువతీ, యువకులు పాల్గొని గ్రామంలో ప్లాస్టిక్ రహిత గ్రామంగా చేయుటలో తమవంతు సహకారం అందించాలన్నారు. ప్రజలు స్వయం ఉపాధి రంగాలలో స్థిరపడాలని, ఎప్పుడికప్పుడు తమ నైపుణ్యాలను మెరుగు పరుచుకొని స్వయం శక్తితో ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని డైరెక్టర్ వై రాధాకృష్ణ అన్నారు.ఈ కార్యక్రమం లో జె యస్ యస్ లబ్ధిదారులు, స్టాఫ్,రిశోర్స్ పర్సన్స్ జాస్మిన్, యస్ కె. రజియా, గ్రామ ప్రెసిడెంట్, సెక్రటరీ పెద్దలు పాల్గొన్నారు.

## డాక్టర్ దూదిమెట్ల బాలరాజ్ యాదవ్ ను కలిసి చాలువ కప్పి స్వాగతం పలికారు



ఇబ్రహీంపట్నం జూలై తేదీ 25 ప్రజాపాలన ప్రతినిధి:తెలంగాణ ఉద్యమ నాయకులు రాష్ట్ర షీప్ అండ్ గోట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ దూదిమెట్ల బాలరాజు యాదవ్ దేవరకొండ వెళుతున్న సందర్భంగా ఇబ్రహీంపట్నంలో స్వాగతం పలికిన టిఆర్ఎస్వి మంచాల్ మండల ప్రధాన కార్యదర్శి పైలెట్ ప్రశాంత్ యాదవ్ ఆధ్వర్యంలో ఉద్యమ నాయకులు జానీ పాషా. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం టిఆర్ఎస్వి ప్రధాన కార్యదర్శి మైలారం విజయ్. బూరుగు ఐలేష్.యాదగిరి గౌడ. ఆవుల శివ కుమార్ యాదవ్. రాజేష్. అచ్చన్న శ్రీకాంత్.పల్లి యాదవ్. రావుల ప్రవీణ్. లల్లూ యాదవ్. తదితరులు పాల్గొన్నారు.

## నూతన అధ్యక్షులుగా రాజశేఖర్ రెడ్డి ప్రమాణస్వీకారం..



తల్లాడ, జులై 25 (ప్రజాపాలన న్యూస్):తల్లాడ లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షులుగా దగ్గుల రాజశేఖర్ రెడ్డి ఆదివారం రాత్రి ప్రమాణస్వీకారం చేశారు. పాస్ట్ డిస్టిక్ గవర్నర్ డాక్టర్ మురళీకృష్ణ ఆయన చేత ప్రమాణం చేయించారు. ఆయనతోపాటు కార్యదర్శిగా వేమిరెడ్డి నారాయణ రెడ్డి, కోశాధికారిగా అనుమోలు సర్వేశరరావు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ క్లబ్ లో సేవా కార్యక్రమాలు చేపడతారని తెలిపారు. క్లబ్ సభ్యుల సహకారంతో ప్రజలకు సేవలు చేస్తామన్నారు. అనంతరం పలువురు పేద మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు కర్నాటి లక్ష్మారెడ్డి, ఉంద్రు శ్యాంబాబు, లగడపాటి, మిట్టపల్లి నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

## వర్గీకరణ చేయకుండా మాదిగలను మోసం చేసినట్లే: జిల్లా కన్వీనర్ సునీల్ మాదిగ



బోనకల్, జులై 25 ప్రజా పాలన ప్రతినిధి: ప్రస్తుత పార్లమెంట్లోని ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధ కల్పించాలని మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు మండల కేంద్రంగా ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ కూరపాటి సునీల్ మాదిగ నిరసన దీక్షను ప్రారంభించారు. మండల ఎమ్మార్పీఎస్ మండల నాయకులు , జిల్లా నాయకులు కోట హనుమంతు మాదిగ, తాటికొండ వెంకటరత్నం మాదిగ, తోటపల్లి చిన్న సైదులు మాదిగ ఆధ్వర్యంలో నిరసన దీక్ష ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ కూరపాటి సునీల్ మాదిగ మాట్లాడుతూ వర్గీకరణ పై బిజెపి ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వీడాలని, మాట ఇచ్చి వర్గీకరణ చేయకుండా ఉండటం మాదిగలను మోసం చేయటమేనని ప్రస్తుత పార్లమెంట్ సమావేశంలోనే ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధ కల్పించి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని లేకుంటే రాజకీయ పతనం తప్పదని హెచ్చరించారు. ఈ నిరసన దీక్షకు మండల వైయస్సార్ టిపి నాయకులు ఇరుగు జ్ఞానేశ్, సిపిఎం మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గుగులోత్ పంతు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల గౌరవ సలహాదారుడు తోటపల్లి సాల్మన్ రాజ్ మాదిగ, తోటపల్లి వెంకటేశ్వర్లు మాదిగ ,బలవంతపు నరసింహారావు మాదిగ, బొల్లిపోగు రామారావు మాదిగ, మర్రి కంటి గంగాధర్ మాదిగ, వేల్పుల పవన్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు అండగా జనసేన..చార్వాకుడు



తల్లాడ, జులై 25 (ప్రజా పాలన న్యూస్): నిరుపేదలకు జనసేన పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ తల్లాడ మండల అధ్యక్షులు తుపాకుల చార్వాకుడు అన్నారు.సోమవారం తల్లాడ మండలంలోనికలకోడిమ గ్రామానికి చెందిన బుర్రి కుమారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందించారు. కుమారి ఈనెల 15న మృతి చెందటంతో పేదకుటుంబం కావడంతో ఆ కుటుంబానికి జనసేన పార్టీ సభ్యులు 2600 నగదును ఖర్చుల నిమిత్తం అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన విద్యార్థి ఎగ్జిక్యూటివ్ నెంబర్ చాంద్ పాషా, జనసేనయూత్ వింగ్స్ గోపి, సాయి, కమల్, అసాన్, నరేంద్ర, మణికంఠ రెడ్డి, తిరుమల్ రెడ్డి, పాల్గొన్నారు.

## ‘ఎన్టీఆర్ 30’ హిట్టయితేనే..
# బన్నీ గ్రీన్ సిగ్నల్ ఇస్తాడా?



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ గత ఏడాది ‘పుష్ప’తో ప్రేక్షకులను పలకరించి బ్లాక్ బస్టర్ హిట్ ను ఖాతాలో వేసుకున్నాడు. ఎర్ర చందనం స్మగ్లింగ్ నేపథ్యంలో రూపుదిద్దుకున్న ఈ చిత్రానికి సుకుమార్ దర్శకత్వం వహించారు. మైత్రీ మూవీ మేకర్స్ వారు పాన్ ఇండియా స్థాయిలో నిర్మించారు. డిసెంబర్ 17న మొత్తం ఐదు భాషల్లో రిలీజ్ అయిన ఈ చిత్రం.. నెగటివ్ టాక్ సొంతం చేసుకున్నప్పటికీ అద్భుతమైన కలెక్షన్స్ తో సూపర్ డూపర్ హిట్ గా నిలిచింది.ఇప్పుడు ఈ మూవీకి పార్ట్ 2 కూడా రాబోతోంది. ‘పుష్ప ది రూల్’ టైటిల్ తో తెరకెక్కనున్న ఈ చిత్రం.. త్వరలోనే సెట్స్ మీదకు వెళ్లబోతోంది. ప్రస్తుతం సుకుమార్ స్క్రిప్ట్ లో పలు మార్పులు చేర్పులు చేస్తున్నారని టాక్ నడుస్తోంది. ఇదిలా ఉంటే.. బన్నీ గతంలో స్టార్ డైరెక్టర్ కొరటాల శివతో ఓ మూవీని అనౌన్స్ చేసిన సంగతి తెలిసిందే. ‘చ%ూూా%21’ వర్కింగ్ టైటిల్ తో ఓ పోస్టర్ ను కూడా విడుదల చేశారు. ఈ సినిమాను యువసుధ ఆర్ట్స్ జీఏ 2 పిక్చర్స్ సంయుక్తంగా నిర్మించాల్సి ఉంది. పుష్ప రెండు పార్ట్ లు కూడా పూర్తి అయిన తర్వాత ఈ ప్రాజెక్ట్ స్టార్ట్ అవుతుందని అన్నారు. కానీ రీసెంట్ గా మెగాస్టార్ చిరంజీవి-రామ్ చరణ్ లను హీరోలుగా పెట్టి కొరటాల శివ రూపొందించిన ‘ఆచార్య’ బాక్సాఫీస్ వద్ద ఘోరంగా బోల్తా పడింది. అసలు కొరటాల నుండి ఇలాంటి సినిమా ఊహించలేదని చాలా మంది పెదవి విరిచారు. ఇన్నాళ్లు అపజయం ఎరుగని దర్శకుడిగా చలామణి అయిన కొరటాల శివ.. ఆచార్యతో భారీ ఫ్లాప్ ను మూటగట్టుకున్నాడు. ఈ నేపథ్యంలోనే వరుస హిట్స్ తో దూసుకుపోతున్న బన్నీ.. ఇప్పుడు కొరటాలతో సినిమా అంటే వెనకడుగు వేస్తున్నాడట. ప్రస్తుతం కొరటాల శివ యంగ్ టైగర్ ఎన్టీఆర్ తో ఓ సినిమా చేయబోతున్నాడు. ‘ఎన్టీఆర్ 30’ వర్కింగ్ టైటిల్ తో ఈ మూవీ ప్రారంభం కాబోతోంది. నందమూరి తారకరామారావు ఆర్ట్స్ యువసుధ ఆర్ట్స్ బ్యానర్లపై పాన్ ఇండియా స్థాయిలో నిర్మితం కాబోతున్న ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించనున్నారు. ఇప్పటికే ఈ మూవీ నుండి బయటకు వచ్చిన గ్లింప్స్ విశేషంగా ఆకట్టుకుంది. మరికొద్ది రోజుల్లో రెగ్యులర్ షూటింగ్ సైతం షురూ కానుంది. అయితే ఈ సినిమా హిట్టయితేనే.. ‘చ%ూూా%21’ చేసేందుకు బన్నీ గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలని భావిస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. దీంతో ఇప్పుడు బన్నీతో సినిమా చేయాలంటే.. ఎన్టీఆర్ కు కొరటాల హిట్ ఇవ్వాల్సిందే అని అంటున్నారు.

# హీరోయిన్ గా కమెడియన్ డాటర్





సినిమా ప్రపంచంలో వారసత్వం గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అయితే ఈ రూట్లో సక్సెస్ అయిన వారి సంఖ్య చాలా తక్కువగా ఉంది. కేవలం బ్యాగ్రౌండ్ ఉంటేనే సరిపోదు మంచి టాలెంట్ ఉంటేనే ఎవరైనా నిలదొక్కుకుంటారు అని చాలాసార్లు రుజువు అయింది. ఇక కమెడియన్స్ ఫ్యామిలీకి చెందిన వారసులు కూడా సినిమా ప్రపంచంలో వారి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఇక 30 ఇయర్స్ ఇండస్ట్రీ డైలాగ్ తో ఎంతగానో క్రేజ్ అందుకున్న కమెడియన్ పృథ్వీ కూతురు కూడా త్వరలోనే హీరోయిన్ గా ఇండస్ట్రీలో బిజీ అవ్వాలని అడుగులు వేస్తోంది. గతంలోని పృద్వీ తన పిల్లల సినిమా ఎంట్రీ విషయం గురించి ముందుగానే క్లారిటీ ఇచ్చాడు. ముఖ్యంగా తన కూతురు నటిగా ప్రత్యేకంగా గుర్తింపును అందుకోవాలని అనుకుంటుంది అని.. ప్రత్యేకంగా శిక్షణ కూడా తీసుకుంది అని వివరణ ఇచ్చాడు.కొత్త రంగుల ప్రపంచం అనే సినిమా ద్వారా పృథ్వీరాజ్ కూతురు శ్రీలు హీరోయిన్ గా వెండి తెరకు పరిచయం కాబోతోంది. ఇక ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ పనులన్నీ కూడా ఫినిష్ అయ్యాయి. త్వరలోనే సినిమా కూడా విడుదల కాబోతోంది.ఇక ఈ సందర్భంగా నన్ను ఆదరించినట్లే నా కూతురుకి కూడా మీ సపోర్ట్ కావాలి అని పృథ్వీరాజ్ ఒక వీడియోలో వివరణ ఇచ్చాడు. తప్పకుండా ఈ సినిమా ఆమెకు మంచి గుర్తింపును లభిస్తుంది అని నటనలో అలాగే డ్యాన్స్ లో కూడా తన కూతురు ఎంతో శిక్షణ తీసుకుందని కూడా అన్నారు.

ఇక ఈ సినిమా ద్వారానే పృథ్వీరాజ్ సన్నిహిత స్నేహితుడు కుమారుడు క్రాంతి కూడా హీరోగా పరిచయం కాబోతున్నాడు. ఈ సినిమా రెగ్యులర్ ప్రమోషన్స్ విషయంలో మరింత డోస్ పెంచాలని కూడా పృద్వీ ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక గతంలో రాజకీయ నాయకుడిగా కూడా పృద్వీ తన అదృష్టాన్ని పరీక్షించుకున్న విషయం తెలిసిందే. ఇక మళ్ళీ ప్రస్తుతం సినిమా ఇండస్ట్రీలో కూడా బిజీ అవ్వాలని ఆయన ప్రయత్నాలు చేస్తున్నారు.

# లెక్కలు అర్థంకాకపోతే అలాగే ఉంటుది జాన్వీ!



అతిలోక సుందరి వారసురాలిగా బాలీవుడ్ కి ఎంట్రీ ఇచ్చిన జాన్వీకపూర్ కెరీర్ దేదీప్యమానంగా సాగిపోతున్న సంగతి తెలిసిందే. నటిగా పరణితి చెందుతూ హిందీ పరిశ్రమలో తనకంటూ ఓ ప్రత్యేకమైన గుర్తింపు దక్కించుకునే దిశగా అడుగుల వేస్తోంది. తండ్రి బోనీకపూర్ సూచనలు..సలహాలు పాటిస్తూ కెరీర్ విషయంలో తప్పటడుగులు పడకుండా జాగ్రత్తలు తీసుకుంటుంది.తల్లికి తగ్గ తనయ అనిపించుకునేందుకు నిరంతరం కృషి చేస్తోం ది. తాజాగా బ్యూటీ గుడ్ లక్ జెర్రీ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రావడానికి రెడీ అవుతోంది. ఈ సినిమా ప్రచారంలో భాగంగా అమ్మడు చేసిన వ్యాఖ్యలకు ట్రోలింగ్ బారిన పడింది. ఇంతకీ జాన్వీ ఏమంది? ఎందుకు ట్రోలింగ్ కి గురైందో? తెలియాలంటే అసలు విషయంలో కి వెళ్లాల్సిందే. జాన్వీ కి స్కూల్ డేస్ లో హిస్టరీ సబ్జెక్ట్ అంటే ఎంతో ఇష్టమట. గణితం అంటే అస్సలు గిట్టేది కాదిట. ఇక్కడ హిస్టరీబిగణితాన్ని ముడిపెట్టి మాట్లాడింది. కాలిక్యులేటర్ కనిపెట్టిన తర్వాత లెక్కలు చేయడం సులువైపోయింది. అలాంటప్పుడు కష్టపడి ఆల్ జీబ్రా నేర్చుకోవడం దేనికి? అందువల్ల ఉపయోగం ఏంటి? మ్యాథ్స్ కోసం ఎందుకలా తలలు బద్దలు కొట్టుకుంటారు? చరిత్ర..సాహిత్యం జనాల్ని సంస్కరవంతుల్ని చేస్తున్నాయి.మరి లెక్కలు ఏం నేర్పిస్తున్నాయి? బేసిక్ లెక్కలు వరకూ ఒకే ఆపై వాటివల్ల నిత్య జీవితంలో ఉపయోగం ఏంటి? గణితం జీవితంలో మిమ్మల్ని నెమ్మదించేలా చేస్తుందని తన లాజిక్ ని చెప్పే ప్రయత్నం చేసింది. దీంతో జాన్వీకపూర్ కి లెక్కలు రావనుకుంటా? అందుకే ఇలాంటి లాజిక్ లు చెబుతుందంటూ ట్రో లింగ్ బారిన పడింది.కాలిక్యూలేటర్ ద్వారా ఆల్ జీబ్రా చేసేందుకు జాన్వీ ప్రయత్నిస్తుందా? ఏంటి? ఇక్కడే జాన్వీ లాజిక్ చచ్చిపోయింది. ముందుకు సాగండి ఇంకా ఇలాంటివి చాలా చూడాలి. లక్షల ఫీజులు కట్టి ఇంటర్నేషనల్ స్కూల్లో చదివిన వారి నాలెడ్జ్ ఎలా ఉంటుంది? అనడానికి రుజువు గా జాన్వీని ఎత్తిచూపుతున్నారు. మీకు లెక్కలు రాకపోతే గణితాన్ని ఎందుకు నిందిస్తారు? అని జాన్వీపై ఊ మండిపడుతున్నారు.జాన్వీకి కూడికలు..తీసివేతల దగ్గర నుంచి మళ్లీ నేర్పిస్తే తప్ప లెక్కల గురించి పూర్తిగా అవగాహన రాదంటూ కామెంట్లు పెడుతున్నారు. ప్రస్తుతం ఆ వీడియో నెట్టింట వైరల్ గా మారింది. లెక్కలు ఎలాగూ రావు కాబట్టి కాలేజీలో అమ్మడు వాటికి దూరంగా ఉండే గ్రూప్ నే తీసుకుని ఉంటుంది. లెక్కలు అర్థంకాని వారి పరిస్థితి దాదాపు జాన్వీలాగే ఉంటుంది.

# ప్రభాస్ హాలీడే ఫేవరేట్ స్పాట్ ఏంటో తెలుసా?



టాలీవుడ్ స్టార్ హీరోలు గత కొంత కాలంగా వరుస షూటింగ్ లతో బిజీ బిజీగా గడిపేస్తున్నారు. కరోనాకు ముందు షూటింగ్ లు పూర్తి కాగానే నచ్చిన స్పాట్ కి ప్లేస్ కి లేదా కంట్రీ వెళ్లిపోయి అక్కడ సరదాగా గడిపేయడం.. అక్కడ వీధుల్లో ఫ్రీ మ్యాన్ లా అందరితో కలిసి పోయి విహరించడం చేస్తుంటారు. ఇక పెళ్లైన హీరోల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. సూపర్ స్టార్ మహేష్ బాబు తన షూటింగ్ పూర్తయిందా వెంటనే ఫ్యామిలీతో వెకేషన్ కి వెళ్లిపోతుంటారు. ఫ్యామిలీతో కలిసి విదేశాల్లో విహరిస్తూ ఆ మధుర క్షణాలని ఆస్వాదిస్తుంటారు.మెగా హీరో రామ్ చరణ్ కూడా ఈ మధ్య వైఫ్ ఉపాసన కారణంగా వెకేషన్ కి విదేశాల్లో విహరిస్తూ ఆ మధురాను భూతులని అభిమానులతో పంచుకుంటు న్నారు. పలు ఫోటోలని షేర్ చేస్తూ ఫ్యాన్స్ కి ట్రీట్ ఇస్తున్నారు. అయితే పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ మాత్రం తన వెకేషన్ టూర్ కి సంబంధించిన విశేసాలని మాత్రం ఫ్యాన్స్ తో పంచుకోవడం లేదు. చాలా లో ప్రొఫైల్ మెయింటైన్ చేస్తున్నారు. షూటింగ్ లు పూర్తవగానే ప్రభాస్ విదేశాలకు వెళ్లిపోతున్నారు.తనకు నచ్చిన దేశంలోని నచ్చిన స్పాట్ కి వెళ్లి అక్కడే ఎంజాయ్ చేస్తున్నారు. హ్యాపీగా రిలాక్స్ అవుతున్నారు. ఇంతకీ మన పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ వెకేషన్ కి వెళుతోంది ఎక్కడికి? ఆయనకు అత్యంత నచ్చిన ఫేవరేట్ స్పాట్ ఏంటీ? ఇంతకీ ఆయన ఏ దేశం వెళు తున్నారు? అన్నది ఇప్పుడు అసక్తికరంగా మారింది. ప్రభాస్ షూటింగ్ లు వున్నప్పుడు మాత్రమే ఇండియాలో వుంటున్నారు. షూటింగ్ లు ప్యాకప్ అనగానే ఇటలీ వెళ్లిపోతున్నారట.అక్కడి ఫేవరేట్ స్పాట్ లో ఓ లావిష్ విల్లాని రెండ్ కి తీసుకున్న ప్రభాస్ మిగతా సమయాల్లో అక్కడే వుంటూ ఓ సాధరణ యువకుడిగా అక్కడి రోడ్లపై విహరిస్తూ పర్సనల్ లైఫ్ ని ఎంజాయ్ చేస్తున్నారట. ప్రభాస్ నటిస్తున్న లేటెస్ట్ సైన్స్ ఫిక్సన్ ‘ ప్రాజెక్ట్ కె’. నాగ్ అశ్విన్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న ఈ మూవీ లేటెస్ట్ షెడ్యూల్ ఇటీవలే పూర్తయిందట. దీంతో ప్రభాస్ విశ్రాంతి కోసం ఇటలీ వెళ్లడానికి రెడీ అవుతున్నారని వార్తలు వినిపిస్తున్నాయి.ఇదిలా వుంటే ఇటీవల ప్రకటించిన జాతీయ పురస్కారాల్లో ‘ఆదిపురుష్’ దర్శకుడు ఓం రౌత్ రూపొందించిన ‘తానాజీ’ చిత్రానికి మూడు విభాగాల్లో అవార్డులు దక్కాయి. మరాఠీలో ‘లోకమాన్య ఏక్ యుగ్ పురుష్’ పేరుతో రూపొందిన సినిమాతో తొలిసారి దర్శకుడిగా పరిచయం అయిన ఓం రౌత్ ఆ తరువాత హిందీలో ‘తానాజీ’ మూవీతో అరంగేట్రం చేశారు. ఈ మూవీకి మూడు జాతీయ పురస్కారాలు దక్కిన నేపథ్యంలో హీరో ప్రభాస్ ఈ చిత్ర బృందానికి ప్రత్యేకంగా పార్టీ ఇవ్వబోతున్నారట. ఈ పార్టీని ప్రభాస్ హైదరాబాద్ లో ఏర్పాటు చేయబోతుండటంతో ‘తానాజీ’ టీమ్ అంతా ఇక్కడికే రాబోతున్నారని తెలిసింది. పార్టీ తరువాతే ప్రభాస్ ఇటలీ వెళ్లనున్నారట. తిరిగి వచ్చాక ‘సలార్’ షూటింగ్ లో పాల్గొంటారని చెబుతున్నారు.

# ఆ సూపర్ స్టార్ మన స్టార్స్ ని తెగ వాడేస్తున్నాడుగా..!



బాలీవుడ్ సూపర్ స్టార్ ఆమీర్ ఖాన్ లాల్ సింగ్ చద్దా సినిమా సౌత్ లో భారీ ఎత్తున విడుదల చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడు. తెలుగు స్టార్ నాగ చైతన్య ఈ సినిమా లో ఉండటంతో సహజంగానే తెలుగు ప్రేక్షకుల అటెన్షన్ ను దక్కించుకుంది. పైగా ఈ సినిమా ను చిరంజీవి సాధ్యం అయినంత ఎక్కువగా ప్రమోట్ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడు.చిరంజీవి సమర్పిస్తున్న ఈ సినిమా లో సౌత్ స్టార్ విజయ్ సేతుపతి కూడా ఉండటంతో తమిళ ఆడియన్స్ కూడా ఈ సినిమా పై అంచనాలు.. ఆసక్తి పెంచుకున్నారు.తెలుగు లో ఈ సినిమా ను భారీ గా ప్రమోట్ చేయడం కోసం యూనిట్ సభ్యులను టాలీవుడ్ స్టార్ హీరో నాగార్జున ఇంటర్వ్యూ చేసినట్లుగా తెలుస్తోంది. ఆమీర్ ఖాన్.. చిరంజీవి మరియు నాగ చైతన్య లను నాగార్జున ఇంటర్వ్యూ చేశాడని సమాచారం అందుతోంది.ఇంటర్వ్యూ రికార్డ్ చేయగా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు ఆ ఇంటర్వ్యూను తీసుకు రాబోతున్నట్లు తెలుస్తోంది.


స్నేహ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటి లిమిటెడ్

PAY BACK TO SOCIETY SNEHA CLUB | SNEHA MACS

గత 20 సం॥లు గా సమాజ మార్పుకోసం కంపెనీకి వచ్చే లాభాలను పేదప్రజల కనీస అవసరాల కోసం ఖర్చు చేస్తూ సోషల్ ఇంజనీరింగ్ చేస్తున్నాం.

SCHEDULE OF INTEREST RATES ON FIXED & R.D. ACCOUNTS

| Term | General | Senior Citizens |
|---|---|---|
| 180 Days - 1 Year | 7% | 7.5% |
| 1 Year - 2 Years | 8% | 8.5% |
| 2 Years - 3 Years | 9% | 9.5% |
| 3 Years - 5 Years | 10% | 10.5% |
| Above 5 Years | 11% | 11.5% |
| Savings Bank A/c | 5% | 5% |
| Recurring Deposit | 6% | 6.5% |

J.B. RAJU, IIS, vrs
Ambassador
Dr. B.M. Vinod Kumar IFS Retd
Nerella Koteswara Rao DGM vrs BSNL
Dr. Guduri Seethamaha Lakshmi
M. Padma Sarma D.E. vrs BSNL
G. Kenny Bob

Dr. N. Venkateswarlu Principal Retd, Govt. Dental College
P.M. Raju. Chief Engineer, Retd
A. Punna Rao Chief Manager, Retd, Canara Bank
Arepally Rajendar DGM vrs, NTPC
S. Rama Krishna

Chairman : Dr. K. Siva Bhagya Rao, IRS vrs

CONTACT :

| | | | |
|---|---|---|---|
| Hyderabad | 76600 27682, 7842106355 | Tirupathi | 94400 77239 |
| Visakhapatnam | 0891-2791205, 9246663046 | Bapatla | 94403 20562 |
| | 7660027696, 7660027664 | Ponnur | 99089 91763 |
| Vijayawada | 76600 27670, 900062111 | Cherukupalli | 79958 56068 |
| | | Karlapalem | 76600 27676 |

H.No. 6-29/3/12, 3rd Floor, Daulat Plaza, Lakdikapul, Hyderabad - 500 004
E-mail : snehamacsltd@gmail.com


Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2-29/3/13, 3rd Floor (Part ‘A’), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989